# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 238 | హైదరాబాద్ | శనివారం 14-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00




త్వరలోనే ఇరాన్ లొంగిపోతుంది : ట్రంప్ 11లో



## మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు


- 'మూసీ ఇన్సైట్స్' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తాజ్‌కృష్ణలో ఎంఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ నరసింహారెడ్డి ప్రజెంటేషన్

11లో

## ఎల్‌పీజీ కొరత! శిర్డీలో 'సోలార్ కుకింగ్ సిస్టమ్'తో వంటలు

- మిడిల్ ఈస్ట్‌లో సంక్షోభం
- దేశంలో గ్యాస్ కొరతపై ఆందోళనలు
- శిర్డీలో సౌరశక్తి ద్వారా వంటలు

11లో



అసోం నుంచి తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే

## అమృత్ భారత్ రైలు ప్రారంభం

- తక్కువ ఛార్జీలతో ప్రారంభించిన మోదీ

11లో



## 'సిద్ధంగా ఉండండి'

### 6 నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగొచ్చు

- ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికలల్లో మనం గెలిచామన్న చంద్రబాబు
- ఎన్నిక ఏదైనా కూటమిదే గెలుపు కావాలని వెల్లడి
- కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని ప్రజలకు వివరించాలన్న సీఎం



11లో



11లో


అమరావతిలో బిట్స్

## పిలానీ 'ఏఐ ప్లస్ క్యాంపస్'

- లోకేష్‌ను కలిసి క్యాంపస్ ప్లాన్లు చూపించిన బిట్స్ పిలానీ ప్రతినిధులు
- క్యాంపస్‌లో ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్ కోర్సులు ఉంటాయన్న ప్రతినిధులు

## భారత్ మా మిత్రదేశం

అందుకే సురక్షిత మార్గం కల్పిస్తున్నాం: ఇరాన్ రాయబారి



11

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై దాడి

- గుర్తుపట్టలేని విధంగా మారిన ముజ్తబా: అమెరికా
- ఇరాన్ కళ్లు కప్పి, తికమక పెట్టి, బోల్తా కొట్టించి దాడులు
- యుద్ధ వ్యూహాల కోసం ఏఐ, అంతరిక్ష టెక్నాలజీల వినియోగం



11లో



గ్యాస్ బుకింగ్‌లో

## తీవ్ర అవస్థలు

- గ్యాస్ ఏజెన్సీల వద్దకు జనం పరుగులు
- వాణిజ్య సిలిండర్ల కొరతతో కట్టెలకు డిమాండ్
- ఒకటి, రెండు రోజుల్లో సిలిండర్ రావాల్సింది ఇప్పుడు వారం రోజుల సమయం

11లో

చెరువుల 'కబ్జా'కోరులకు

## శాటిలైట్ షాక్!

- ఎన్ఆర్ఎస్‌సీ డేటాతో హైడ్రా 'వజ్రాయుధం'.. బయటపడ్డ 61% చెరువుల అదృశ్యం
- ఎఫ్‌టీఎల్ లెక్క తేల్చేందుకు 2006 నాటి డీఈఎం రిపోర్ట్స్
- రూ. 70వేల కోట్ల విలువైన 13,500 ఎకరాల భూమి సేఫ్
- త్వరలో 'హైడ్రా-రక్ష' పోర్టల్.. రియల్ మోసాలకు ఇక చెక్



12లో

భారత శక్తి

# అగ్రరాజ్యమే ప్రథమ ముద్దాయి

ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ తీర్మానాల్లోని సగటు పదాల సంఖ్య గడిచిన అయిదేళ్లలో 55శాతం పెరిగిందట! భద్రతామండలి తీర్మాన పత్రాలైతే ముప్పై ఏళ్ల కిందటితో పోలిస్తే మూడు రెట్లు పెద్దవి అయ్యాయట! సంక్లిష్టభరితమైన సంక్షుభితమైన సమకాలీన ప్రపంచంలో సామరస్యం కోసం తాము ఎంత కష్టపడుతున్నామో ఏకరవు పెడుతూ ఐరాస వర్గాలే ఈ లెక్కలను తమ వెబ్సైట్లో ఉంచాయి. తీర్మానాలు ఎంత భారీగా ఉంటే ఏంటి లాభం... అవన్నీ ఆచరణలో చిత్తుకాగితాలుగా మిగిలిపోతున్నప్పుడు!? ఐరాస ఆకాంక్షలు, అభ్యర్థనలు, హెచ్చరికలన్నీ నీటిపై రాతలు అవుతున్నాయని, యుద్ధాలూ మానవతా సంక్షోభాలను నివారించడంలో యూఎన్ ఘోరంగా విఫలమవుతోందన్నది ఎప్పటి నుంచో వినిపిస్తున్న విమర్శే. ఐరాస ప్రతిష్ఠను మసకబార్చుతున్న ఆ దురవస్థను చెదరగొట్టే సంస్కరణలకోసం పలు దేశాలు పట్టుబడుతున్నాయి. ముఖ్యంగా ప్రాతినిధ్యం, ప్రభావాల కోణంలో భద్రతామండలిని మరింత బలోపేతం చేయాలంటే తమకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని ఇండియా, జపాన్, బ్రెజిల్ వంటివి చిరకాలంగా గళమెత్తుతున్నాయి. అంతేతప్ప, ఆ విశ్వజన సభను పట్టుకుని 'కళంకితమైన, అవినీతిమయమైన, హానికరమైన ప్రపంచ శక్తి'గా ఇంతవరకు ఎవరూ తూలనాడలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొన్న ఐరాసపై ఈ అభాండాలన్నీ వేశారు. అలా తన వదరబోతుతనాన్ని మరోసారి ప్రదర్శించిన ఆయన– ఐరాసను నిస్తేజం చేసిన నేరంలో ప్రథమ ముద్దాయి అగ్రరాజ్యమేనన్న సత్యాన్ని కప్పెట్టేశారు!

రెండో ప్రపంచ యుద్ధాన్ని అడ్డుకోవడంలో నానాజాతి సమితి చేతులెత్తేసిన దరిమిలా ఐరాస ఏర్పాటుకు పునాదులు పడ్డాయి. దేశాల నడుమ ఘర్షణాత్మక వాతావరణం తలెత్తకుండా చూడటం, ప్రపంచ శాంతిభద్రతలను పరిరక్షించడం, స్నేహ సౌహార్దాలతో మానవాళి యావత్తూ సమష్టిగా పురోగమించేలా కృషి చేయడం వంటివి యూఎన్ లక్ష్యాలయ్యాయి. వాటిని సాధించడంకోసం నిర్దేశించుకున్న అంతర్జాతీయ కట్టుబాట్లను అమెరికా కాలదన్నిన ఉదంతాలు అనేకం! స్వప్రయోజనాలకోసం అనేక దేశాల వ్యవహారాల్లో అగ్రరాజ్యం జోక్యం చేసుకుని మానవత్వాన్ని మసిచేసే రావణకాష్ఠాలను రగిలించిన సందర్భాలకూ కొదవలేదు. ఇక వర్తమానంలో ఇజ్రాయెల్ బలగాలు గాజాలో పాల్పడుతున్న కిరాతక జాతిహననాన్ని ఖండించే ఐరాస తీర్మానాలను అమెరికా వరసగా 'వీటో' చేస్తోంది. భద్రతామండలిలో తనకు ఉన్న అధికారాన్ని అలా పాలస్తీనా వాసుల గొంతుకోసేందుకు ప్రయోగిస్తోంది. అలాంటి అమానవీయ అగ్రరాజ్యాధిపతి– ఉక్రెయిన్పై రష్యా యుద్ధానికి ఇండియా, చైనా సొమ్ములిస్తున్నాయంటూ ఐరాస వేదికగా గుడ్లురుమి తన గురివింద పోకడలను బయటపెట్టుకున్నారు!

అంతర్జాతీయ వేదికలను, ఒడంబడికలను పూచికపుల్లల్లా తీసిపారేయడం ట్రంప్నకు ఇప్పుడు కొత్తేమీ కాదు. పర్యావరణ మార్పులు బూటకమంటూ తరచూ వితండ వాదనలు చేసే ఆయన– పారిస్ వాతావరణ ఒప్పందంలోంచి అమెరికాను వెనక్కి లాక్కొచ్చారు. హ్యూమన్రైట్స్ కౌన్సిల్కు, యునెస్కోకు చెయ్యిచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ విషయంలోనూ అలాగే ప్రవర్తించారు. ఐరాసకు ఇప్పటికే వంద కోట్ల డాలర్ల నిధులను బిగబట్టిన ట్రంప్– మరో వంద కోట్ల డాలర్ల మేర కోతపెట్టడానికీ సిద్ధమవుతున్నారు. ఏకపక్ష విధానాలతో వీలైనన్ని మార్గాల్లో యూఎన్ను బలహీనపరిచేందుకు ట్రంప్ చేస్తున్న దుర్మార్గ ప్రయత్నాలు విశ్వమానవ శ్రేయానికి విఘాతకరమవుతాయి. యుద్ధోన్మాదులూ మానవహక్కులను కబళించే నిరంకుశ రాజ్యపాలకులకు అవి కొత్త ఆయుధాలవుతాయి. అన్నార్తులూ నిరాశ్రయుల బతుకులను మరింత శిథిలం చేస్తాయి!

# 2050 నాటికి భాగ్యనగరానికి 4 లక్షల కోట్ల ప్రణాళిక

హైదరాబాద్ మార్చి 13, (

హైదరాబాద్ నగరం రూపురేఖలు మార్చేందుకు హెచ్ఎండీఏ అనేక రకాల ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగరంలో మెట్రోను భారీగా విస్తరించాలని భావిస్తోంది. నగరం నడిబొడ్డున మూసీ నదిపై భారీగా వంతెనలు నిర్మించనున్నట్లు తెలిపింది. ఇవే కాకుండా నగరంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కైవాక్లు, రోడ్ల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, బ్రిడ్జిలు సహా సమగ్ర అభివృద్ధికి సంబంధించి ప్లాన్లు రెడీ చేస్తోంది.ప్రపంచంలోనే హైదరాబాద్ ఒక మహా నగరంగా అవతరిస్తోంది. గత 10 ఏళ్లలో హైదరాబాద్ రూపురేఖలే మారిపోయాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు శరవేగంగా విస్తరించిన హైదరాబాద్ మహా నగరం.. మరింతగా వ్యాపిస్తోంది. ఈ నేపథ్యంలోనే దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా.. ప్రపంచ దేశాల నుంచి కూడా ప్రజలు ఇక్కడికి వచ్చి ఉద్యోగం, ఉపాధి, విద్య వంటి అవసరాల కోసం జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా ప్రభుత్వాలు.. హైదరాబాద్లో మౌలిక సదుపాయాలను కూడా అదే వేగంతో కల్పిస్తున్నాయి. అయినప్పటికీ నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఈ నేపథ్యంలోనే రానున్న రోజుల్లో మరింత మంది ప్రజలు, వాహనాలు పెరిగిపోతాయనే అంచనాలతో ట్రాఫిక్ రద్దీని నిర్వహించేందుకు మౌలిక వసతులను సర్కార్ కల్పిస్తోంది.2050 నాటికి హైదరాబాద్ మహా నగరాన్ని ఏ విధంగా మార్చాలి అనే దానిపై హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ ( హెచ్ఎండీఏ ) సమగ్ర రవాణా వ్యవస్థపై కీలక ప్రణాళికను రెడీ చేసింది. 2050 నాటికి హైదరాబాద్ నగరంలో మెట్రో నెట్వర్క్ను ఏకంగా 556.6 కిలోమీటర్ల మేర విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం దాదాపు 70 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించి ఉండగా.. రెండో విడతలో భాగంగా మరో 150 కిలోమీటర్ల వరకు విస్తరించేందుకు అనుమతులు లభించాయి.ఇక మల్టీ మోడల్ ట్రాన్స్పోర్టు సిస్టమ్ (ఎంఎంటీఎస్) నెట్వర్క్ను 336.4 కిలోమీటర్ల వరకు పెంచాలని హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇక హైదరాబాద్ నగరంలో రోడ్ల నెట్వర్క్ను 19,352 కిలోమీటర్లకు విస్తరించాలని భావిస్తోంది. అదే సమయంలో నగరంలో కొత్తగా 120 ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, స్కైవాక్ల నిర్మాణానికి హెచ్ఎండీఏ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.ఇవే కాకుండా 34 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్వోబీలు), 16 రైల్ అండర్ బ్రిడ్జిలు (ఆర్యూబీలు), 8 ఎలివేటెడ్ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు హెచ్ఎండీఏ అధికారులు వెల్లడించారు. అదే సమయంలో హైదరాబాద్ నగరం మధ్య నుంచి వెళ్తున్న మూసీ నదిపై 29 బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. 2050 నాటికి ప్రత్యేక బస్ లైన్ల కోసం 48 కిలోమీటర్ల మేర రోడ్ కారిడార్లను గుర్తించినట్లు తెలిపారు. 7 అంతర్రాష్ట్ర బస్సు, ట్రక్ టెర్మినల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అయితే 2050 హైదరాబాద్ నగర సమగ్ర రవాణా వ్యవస్థ ప్రణాళిక కోసం రూ.4 లక్షల కోట్లు అవసరం అవుతాయని హెచ్ఎండీఏ అంచనాలు వేస్తోంది.

# కవిత కథ మళ్లీ మొదటికి

హైదరాబాద్ మార్చి 13,



ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ఫిబ్రవరి 27న లిక్కర్ స్కామ్ కేసులో కవితతో పాటు ఇతర నిందితులను డిశ్చార్జ్ చేస్తూ తీర్పునిచ్చింది. అయినా సీబీఐ అధికారులు హైదరాబాద్కు వచ్చి మరీ కవితకు నోటీసులు ఇచ్చారు. భారతీయ న్యాయ వ్యవస్థలో ట్రయల్ కోర్టు ఇచ్చే తీర్పులే చివరివి కావు. ఆ తీర్పులో లోపాలు ఉన్నాయని లేదా సాక్ష్యాలను సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని భావిస్తే, దర్యాప్తు సంస్థలు ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లే హక్కు ఉంటుంది. ఈ క్రమంలోనే సీబీఐ, ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఆర్డర్ను సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది.రెండో అంశం ఏమిటంటే, సీబీఐ స్వయంగా తన సొంత అధికారంతో ఈ నోటీసులు ఇవ్వలేదు. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు , ఈ కేసుపై ప్రతివాదుల వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానాలు జారీ చేసిన ఇటువంటి అధికారిక నోటీసులను సంబంధిత వ్యక్తులకు చేరవేయడం దర్యాప్తు సంస్థ బాధ్యత. అందుకే సీబీఐ అధికారులు గురువారం హైదరాబాద్లోని కవిత నివాసానికి వెళ్లి కోర్టు ఆదేశాలను అందజేశారు.ఇక్కడ గమనించాల్సిన మరో విషయం న్యాయపరమైన ప్రక్రియనే. ట్రయల్ కోర్టు కేసును కొట్టేసినప్పుడు నిందితులు నిర్దోషులుగా విడుదలవుతారు. కానీ, హైకోర్టు ఆ తీర్పును పరిశీలించడానికి ఒప్పుకున్నప్పుడు ఆ కేసు మళ్ళీ సజీవమైనట్లే లెక్క. హైకోర్టు ఈ కేసులో సీబీఐ వాదనలు విన్న తర్వాత, ట్రయల్ కోర్టు తీర్పు సరైనదే అని భావిస్తే కేసు పూర్తిగా ముగుస్తుంది. ఒకవేళ ట్రయల్ కోర్టు నిర్ణయం తప్పని భావిస్తే, మళ్లీ విచారణ జరపాలని ఆదేశించే అవకాశం ఉంటుంది. అంటే ఇప్పుడు జరుగుతున్నది కేవలం తీర్పుపై జరుగుతున్న న్యాయపరమైన సమీక్ష మాత్రమే.చాలామందికి వచ్చే సందేహం ఏమిటంటే, నోటీసులు ఇచ్చిన వెంటనే అరెస్టు చేస్తారా? అని. ప్రస్తుతానికి సీబీఐ అందజేసినవి కోర్టుకు హాజరుకావాలని కోరుతూ ఇచ్చిన నోటీసులు మాత్రమే. ట్రయల్ కోర్టు ఇప్పటికే నిందితులను డిశ్చార్జ్ చేసినందున, హైకోర్టు మళ్లీ స్టే ఇవ్వకుండా లేదా ప్రత్యేక ఆదేశాలు జారీ చేయకుండా నేరుగా అరెస్టు చేసే అవకాశం ఉండదు. మార్చి 16న జరిగే విచారణలో ప్రతివాదులు తమ వాదనలను వినిపించాల్సి ఉంటుంది.ఈ పరిణామం న్యాయపోరాటంలో ఒక సాధారణ ప్రక్రియ. రాజకీయంగా దీనిపై ఆరోపణలు ఉన్నప్పటికీ, చట్టపరంగా చూస్తే ప్రాథమిక కోర్టు తీర్పును ఉన్నత కోర్టులో సవాలు చేయడం దర్యాప్తు సంస్థల విధి. అందుకే కేసు కొట్టేసినా కూడా, ఆ తీర్పు చెల్లుబాటును తేల్చడానికి హైకోర్టు జోక్యం చేసుకుంది. దీనివల్ల నిందితులకు తక్షణమే శిక్ష పడదు కానీ, వారు మళ్లీ కోర్టు మెట్లు ఎక్కి తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ వెంటనే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. సీబీఐ దాఖలు చేసిన ఈ అప్పీల్ పిటిషన్ను విచారణకు స్వీకరించిన హైకోర్టు, ఈ వ్యవహారంపై స్పందించాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు కవిత ఇంటికి వెళ్లి మార్చి 16న విచారణకు హాజరు కావాలని సమన్లు అందజేశారుసాధారణంగా ఒక కేసును ట్రయల్ కోర్టు కొట్టేసినప్పుడు, దర్యాప్తు సంస్థకు పైకోర్టులో అప్పీల్ చేసుకునే హక్కు ఉంటుంది. ఒకవేళ పైకోర్టు ఆ అప్పీల్ను విచారణకు అర్హమైనదిగా భావిస్తే, నిందితులకు నోటీసులు జారీ చేసి వారి వాదనలు వింటుంది. ఈ న్యాయ ప్రక్రియలో భాగంగానే సీబీఐ ఇప్పుడు తన అప్పీల్ పిటిషన్పై విచారణ కోసం నోటీసులు అందజేసింది. దీని అర్థం పాత కేసు మళ్లీ పునఃప్రారంభమైనట్లు కాకపోయినా, తీర్పును సవాలు చేస్తూ జరుగుతున్న న్యాయపోరాటంలో ఇది ఒక కీలక దశ.కీలకమైన సాక్ష్యాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, అందుకే తాము పైకోర్టును ఆశ్రయించామని సీబీఐ వాదిస్తోంది. మార్చి 16న జరిగే విచారణలో ఢిల్లీ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# గ్రేటర్ లో పన్నుల్లో భారీ రాయితీలు

హైదరాబాద్ మార్చి 13,

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెండింగ్లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలపై ఏకంగా 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ వన్ టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని ప్రకటించింది. పాత బకాయిల మీద పేరుకుపోయిన భారీ వడ్డీ భారాన్ని తగ్గించుకోవడానికి ఇది నగరావాసులకు ఒక సువర్ణావకాశం. ఈ ప్రయోజనాన్ని పొందాలనుకునే వారు మార్చి 31, 2026 లోపు తమ బకాయిలను చెల్లించాల్సి ఉంటుంది.పన్ను చెల్లింపుదారులు తమ సౌలభ్యం మేరకు వివిధ మార్గాల్లో ఈ నగదును చెల్లించవచ్చు. జీహెచ్ఎంసీ అధికారిక వెబ్సైట్ , మొబైల్ యాప్ల ద్వారా ఆన్లైన్లో సులభంగా చెల్లింపులు చేయవచ్చు. ఇవే కాకుండా, నేరుగా మీ-సేవా కేంద్రాలు , సిటిజన్ సర్వీస్ సెంటర్లకు వెళ్లి కూడా బకాయిలు చెల్లించి ఈ 90 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పన్ను చెల్లించని వారికి వడ్డీ అసలు కంటే ఎక్కువగా పెరిగిపోయిన సందర్భాల్లో ఈ ఓటీఎస్ పథకం పెద్ద ఊరటనిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన ఈ గడువు ముగిసిన తర్వాత మళ్లీ ఇటువంటి రాయితీలు ఉండకపోవచ్చని, కాబట్టి జాప్యం చేయకుండా త్వరితగతిన పన్ను కట్టాలని అధికారులు సూచిస్తున్నారు. సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా నగర ప్రజలు తమ బాధ్యతను నెరవేర్చడమే కాకుండా, నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.నగరంలో రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి మౌలిక సదుపాయాలన్నీ ప్రజలు కట్టే పన్నుల ద్వారానే సాధ్యమవుతాయి. అందుకే సకాలంలో ఆస్తి పన్ను చెల్లించండి.. మన నగరాభివృద్ధికి తోడ్పడండి అనే నినాదంతో ప్రభుత్వం ఈ ప్రచారాన్ని చేపట్టింది. ఈ ప్రత్యేక రాయితీని వినియోగించుకుని పన్ను బకాయిల చిక్కుల నుంచి బయటపడాలని జీహెచ్ఎంసీ కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ జిల్లాలకు మహర్దశ

నల్గొండ, మార్చి 13

తెలంగాణ జిల్లాలకు మహర్దశ పట్టనుంది. ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని చెప్పారు. రోడ్లు ? భవనాల శాఖ పురోగతిపై సీఎం రేవంత్ ) సంబంధింత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ – విజయవాడ ఎక్స్ప్రెస్ వే నుంచి నాగార్జునసాగర్ చేరేందుకు గ్రీన్ఫీల్డ్ రహదారి నిర్మాణంపైనా అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఇక ప్రభుత్వ శాఖలు ఇకనుంచి తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. కాలుష్య రహిత రవాణా వ్యవస్థ లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ విధానాలకు స్వస్తి చెప్పాలని, మొత్తం ఆన్లైన్లోనే కార్యకలాపాలు కొనసాగించాలని ఆదేశించారు. రవాణా శాఖపై మంత్రి పొన్నంతో కలిసి సమీక్ష నిర్వహించిన సీఎం.. ఆర్టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదన్నారు.వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని, ప్రజల్లో చైతన్యం తేవడానికి షార్ట్ ఫిల్మ్లు ప్రదర్శించాలని సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్కు స్థలం కేటాయిస్తామని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# టీజీపీఎస్సీలో కీలక సవరణలు

హైదరాబాద్, మార్చి 13,

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు కీలక అప్డేట్ ఇచ్చింది. ఇక నుంచి ఆర్నెల్లకోసారి సవరణకు అవకాశం కల్పించింది. దాంతో పాటు కొత్తగా విద్యార్హతలు ఉంటే వాటిని అప్డేట్ చేసుకోవాలని సూచించింది.




ఓటీఆర్లో నమోదు చేసిన వివరాల ఆధారంగానే వారి ఉద్యోగార్హతలు నిర్ణయించనున్నట్లు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు.తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే ఉద్యోగార్థులకు అలర్ట్. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక సంస్కరణ చేపట్టింది. ప్రస్తుతం టీజీపీఎస్సీ వద్ద అందుబాటులోని వన్టైం రిజిస్ట్రేషన్ వివరాలు, అందులోని అర్హత ఆధారంగానే రానున్న ఉద్యోగ ప్రకటనలకు ఆయా అభ్యర్థులకు అర్హత కల్పించనుంది. ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు మాత్రమే ఓటీఆర్లో అప్డేట్ చేసుకునేందుకు అవకాశమివ్వనుంది. అంటే ఏడాదిలో జనవరి, జూన్ నెలల్లో వారం నుంచి 10 రోజులు ఓటీఆర్ అప్డేట్ కు అవకాశం ఇస్తారు. అప్పటికి అదనంగా పొందిన విద్యార్హతలు ఓటీఆర్లో పొందుపరిచేందుకు అభ్యర్థులకు వెసులుబాటు కల్పించనున్నారు. ఇప్పటికీ ఓటీఆర్ అప్డేట్ చేసుకోని వారు తమ ఐడీ సహాయంతో ఈనెల 25లోగా అదనపు అర్హతలకు సంబంధించిన సర్టిఫికేట్లను ఓటీఆర్ పోర్టల్లో అప్లోడ్ చేసుకోవాలని సూచించారు.టీజీపీఎస్సీ కొత్త సవరణల ప్రకారం.. ఉద్యోగార్థులు ఓటీఆర్లో తాజా కలర్ ఫొటోను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. కొత్తగా పొందిన అదనపు విద్యార్హతల సంబంధించిన వివరాలు నమోదు చేయడంతో పాటు ధ్రువపత్రాలు కూడా సమర్పించాలి. ఒకసారి అప్డేట్ చేసిన ఓటీఆర్ను ఆ అభ్యర్థి లేదా కమిషన్ రద్దు చేసేవరకూ చెల్లుబాటవుతుంది. ఓటీఆర్లో అదనపు అర్హతలు, అడ్రస్, ఈడబ్ల్యూఎస్, నాన్ క్రీమీలేయర్ కేటగిరీలు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ మినహా ఇతర వివరాలు అప్డేట్ చేయడానికి వీల్లేదు.రాష్ట్రంలో కమిషన్ వద్ద ప్రస్తుతం 31.56 లక్షల ఓటీఆర్లు ఉన్నాయని టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. గడిచిన రెండేళ్లుగా కొత్తగా ఉద్యోగార్థులైన అభ్యర్థులు 2 లక్షల వరకు ఉంటారని వెల్లడించారు. వీరంతా విద్యార్హతలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటీఆర్లో నమోదు చేసిన కుల, ఆదాయ, క్రీమీలేయర్, విద్యార్హతల వివరాలను టీజీపీఎస్సీ ముందస్తుగా తనిఖీ చేయిస్తుందని అన్నారు. గతంలో విద్యార్హతలు, వ్యక్తిగత వివరాలు పేర్కొన్నా వాటికి ఆధారాలు సమర్పించాలన్న నిబంధన తప్పనిసరి లేదని... తాజా సవరణల ప్రకారం అభ్యర్థులు వాటిని కూడా అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.ఓటీఆర్లో నమోదు చేసిన విద్యార్హతల ఆధారంగానే ప్రభుత్వం విడుదల చేసే ఒక నియామక ప్రకటనకు వారు అర్హులవుతారా? లేదా? అనే విషయాన్ని ఓటీఆర్ గుర్తిస్తుందన్నారు. అందులో నమోదు చేసిన వివరాలను మీసేవ, యూనివర్సిటీలు, సాంకేతిక విద్య, ఉన్నత విద్యామండలి సహాయంతో పరిశీలిస్తుందని చెప్పారు. ఎవరైనా తప్పుడు ధ్రువీకరణతో నమోదు చేసినట్లు వెల్లడైతే వెంటనే వారి ఓటీఆర్ రద్దు చేస్తుందన్నారు.

# సిటీలో మరో కేబుల్ బ్రిడ్జి

హైదరాబాద్, మార్చి 13, (

హైదరాబాద్లో మరో కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇప్పటికే ఉన్న దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి నగరానికి అందాన్ని తీసుకురాగా.. మరొకటి అందుబాటులోకి రానుంది. రెండున్నర కిలోమీటర్ల పొడవు.. 22 మీటర్ల వెడల్పుతో ఈ కొత్త కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరుపుకోనుంది. త్వరలోనే ఆ కేబుల్ బ్రిడ్జికి శంకుస్థాపనలు చేసి.. పనులు మొదలుపెట్టనున్నారు. ఇంతకీ ఆ కొత్త కేబుల్ బ్రిడ్జిని ఎక్కడ నిర్మిస్తున్నారు. దాని సంగతులేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.విశ్వ నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ మహా నగరం.. ఎన్నో అందాలకు అడ్డాగా నిలుస్తోంది. ఆకాశాలను తాకే భవంతులు, ఫ్లైఓవర్లు, అండర్పాస్లు, స్కైవేలు, హైవేలతో భాగ్యనగరం.. శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి .. నగరవాసుల ప్రయాణానికి మాత్రమే కాకుండా సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది. ఈ నేపథ్యంలోనే నగరంలో మరో కేబుల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీర్ ఆలయం ట్యాంక్ వద్ద కేబుల్ బ్రిడ్జిని కట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. త్వరలోనే ఈ కొత్త కేబుల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.హైదరాబాద్లోని మీర్ ఆలం ట్యాంక్ మీదుగా చింతల్మెంట్ రోడ్డును బెంగళూరు నేషనల్ హైవేకు కలుపే మార్గంలో ఈ కొత్త కేబుల్ బ్రిడ్జిని నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దాదాపు 2.65 కిలోమీటర్ల పొడవుతో ఈ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. అదే సమయంలో అది 22.2 మీటర్ల వెడల్పుతో రూ.430 కోట్ల అంచనా వ్యయంతో కట్టనున్నారు.

మీర్ ఆలం ట్యాంక్ సమీపంలోని జాతీయ రహదారి 44 బ్రిడ్జి దగ్గర ఈ సరికొత్త కేబుల్ బ్రిడ్జి ప్రారంభం కానుంది. అక్కడి నుంచి మీర్ ఆలయం పార్క్ సమీపంలోని చింతల్మెట్ రోడ్డు వరకు దాన్ని నిర్మించనున్నారు.ఇక ఈ కేబుల్ బ్రిడ్జి ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంప్లు మీర్ మహమూద్ పహాడీ, కింగ్స్ కాలనీ శాస్త్రిపురం రోడ్డుకు దగ్గర్లో ఉంటాయి. నిజాం కాలంలో ప్రధానిగా పనిచేసిన మీర్ ఆలం బహుదూర్ పేరును.. మూసీ నదికి దక్షిణంగా ఉండే మీర్ ఆలం ట్యాంక్కు పెట్టారు. హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు.. ఉస్మాన్ సాగర్, హిమయత్ సాగర్ ఏర్పాటు చేయడానికి ముందు ఈ మీర్ ఆలయం ట్యాంక్ ప్రధాన వనరుగా ఉండేది.ఇక ఈ కొత్త కేబుల్ బ్రిడ్జిని 4 లైన్లుగా నిర్మించనున్నారు. అయితే ఈ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు చాలాకాలంగా పెండింగ్లో ఉండగా.. ఎట్టకేలకు దానికి ఇప్పుడు మోక్షం లభించింది. ఈ కేబుల్ బ్రిడ్జి రాకతో మీర్ ఆలం ట్యాంక్ ప్రాంతం రూపు రేఖలు మారిపోనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే అక్కడ జీవనోపాధి పెరుగుతుందని భావిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతోపాటు.. వాహనదారులకు మెరుగైన ప్రయాణం కల్పించడానికి ఇది ఉపయోగపడుతుంది.ఇక ఇప్పటికే మాదాపూర్లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో దుర్గం చెరువుపై గత ప్రభుత్వం కేబుల్ బ్రిడ్జిని నిర్మించింది. జూబ్లీహిల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్లో కలుపుతూ నిర్మించిన ఈ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించడమే కాకుండా.. ఒక మంచి టూరిస్ట్ స్పాట్గా కూడా నిలుస్తోంది.

# ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

భద్రాద్రి కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ లో ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం రాత్రి భోజనం అనంతరం సుమారు 11 గంటల సమయం నుంచి 29 మంది విద్యార్థులు వాంతులు విరోచనాలు బాధపడ్డారు..విద్యార్థులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాల్సిన పాఠశాల యాజమాన్యం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పాఠశాలలోనే విద్యార్థులకు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తూ కాలయాపన చేశారు..

గురువారం ఉదయం పట్వారిగూడెం ఆసుపత్రి వైద్యా సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులకు చికిత్స అందించగా 26మంది విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడగ..మిగిలిన మరో ముగ్గురు విద్యార్థులు మాత్రం గురువారం రాత్రి వరకు వాంతులు విరోచనాలు కొనసాగుతున్నాయి.వీరికి పాఠశాలలోని నర్సు సాయంతో చికిత్స అందిస్తున్నారు..

గురువారం రాత్రి వరకు విద్యార్థులు అస్వస్థకు గురైన విషయాన్ని అటు పాఠశాల యాజమాన్యం గాని ప్రభుత్వ వైద్యులు కానీ బయటికి చెప్పకపోవడం విశేషం.

నెమ్మదిగా విషయం దమ్మపేట మండల తహసిల్దార్ రామ్ నరేష్ కు చేరడంతో ఆయన హుటాహుటిన పాఠశాలకు చేరుకొని విద్యార్థులను పరిశీలించారు . అప్పటికే ముగ్గురు విద్యార్థులు పూర్తిగా నిరసించి కనిపించడంతో చలించిన తహసిల్దార్ పాఠశాల యాజమాన్యం పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు..విద్యార్థులు నీరసంతో ఉన్నప్పటికీ అక్కడే ఉండి విద్యార్థులను పర్యవేక్షించాల్సిన డాక్టర్ సైతం అందుబాటులో లేకపోవడం పట్ల మరింత ఆగ్రహానికి గురయ్యారు వెంటనే ప్రభుత్వ డాక్టర్ కు ఫోన్ చేసి వెంటనే పాఠశాలకు రావాలని ఆదేశించారు.108 అంబులెన్స్ వాహనాన్ని సైతం రప్పించి ఇద్దరు విద్యార్థులకు మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

స్థానిక ఎమ్మెల్యే స్వగ్రామంలో ఎమ్మెల్యే నివాసానికి 1000 మీటర్ల దూరంలోనే ఉన్న ఈ పాఠశాలల లో ఇలాంటి సంఘటన చోటు చేసుకున్నప్పటికీ కనీసం ఎమ్మెల్యేకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

అధికారుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదినారాయణ పాఠశాలకు చేరుకొని పాఠశాల యాజమాన్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఇతర రాష్ట్రాల బోధన సిబ్బంది ఉండటంతో అటు గిరిజన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడ అధ్యాపకు బృందంలో విద్యార్థులను పట్టించుకునే వారే లేరని తాను పాఠశాలలను సందర్శించిన సమయంలో కూడా ఇన్చార్జిలుగా ఎవరు విధులు నిర్వర్తించడం లేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

తాను అందుబాటులో ఉన్నప్పటికీ ఇలాంటి సంఘటన జరిగిన సమయంలో కూడా తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఆదినారాయణ, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి అనారోగ్యానికి కారణమైన వారిపై తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

==========================

# పార్టీ ఫిరాయింపుల వ్యవహారానికి ముగింపు

తెలంగాణలో సంచలనం సృష్టించిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై న్యాయపరమైన ఉత్కంఠకు తెరపడింది. సుప్రీంకోర్టు కేసును క్లోజ్ చేసింది. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదన్నదానిపైనే బీఆర్ఎస్ పిటిషన్ వేసింది. ఇప్పుడు స్పీకర్ నిర్ణయం ప్రకటించేశారు. ఈ కేసులో తక్షణమే ఎవరిపై అనర్హతా వేటు పడకపోయినప్పటికీ, భవిష్యత్తు రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేలా ఒక బలమైన బెంచ్ మార్క్ ఈ పిటిషన్లతో ఏర్పడింది.స్పీకర్లు తమ విచక్షణాధికారం పేరుతో అనర్హతా పిటిషన్లను ఏళ్ల తరబడి పెండింగ్లో ఉంచే సంస్కృతికి ఈ తీర్పుతో అడ్డుకట్ట పడినట్లయింది. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో న్యాయస్థానాల జోక్యం ఎంత అవసరమో ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో స్పీకర్లు తమకు ఉన్న అధికారాలను అస్త్రంగా చేసుకుని కాలయాపన చేసేవారు. ఫలితంగా ఫిరాయించిన వారు ఐదేళ్ల పదవీకాలాన్ని నిశ్చింతగా పూర్తి చేసుకునే అవకాశం ఉండేది.తాజా పరిణామాల ప్రకారం స్పీకర్ల విచక్షణాధికారం అనేది రాజ్యాంగ బద్ధమైన బాధ్యతే తప్ప, నిర్ణయాన్ని వాయిదా వేసే హక్కు కాదని తేలిపోయింది. సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించిన గడువు లోపే ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ పరిణామం కేవలం ఒక రాష్ట్రానికో లేదా ఒక పార్టీకో పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఒక ఉదాహరణగా నిలవనుంది.పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం 10వ షెడ్యూల్ అసలు ఉద్దేశం నెరవేరాలంటే, నిర్ణీత కాలపరిమితిలో తీర్పులు రావడం అనివార్యమని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ కేసు ముగింపు రాజకీయ నాయకులకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. కానీ స్పీకర్ నిర్ణయం మాత్రమే.. అనేక రకాల చర్చలకు కారణం అవుతోంది.

# గ్యాస్ వినియోగం 30నుండి 40 శాతం తగ్గించి వాడాలి

## త్వరలో ఈ సంక్షోభం నుంచి బయటపడతాం

సికింద్రాబాద్ మార్చి 13, (

తెలంగాణ హోటల్స్ అసోసియేషన్, తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సికింద్రాబాద్ లో సమావేశమైయారు. గ్యాస్ సంక్షోభంపై చర్చించారు. ఇబ్బందులను అధిగమించడపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సంక్షోభం నుండి బయట పడే వరకు గ్యాస్ వినియోగంలో పొదుపు పాటించాలని నిర్ణయించారు.

తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పాత బాకీలు చెల్లించడంతో పాటు ఎప్పటికప్పుడు నగదు చెల్లించి గ్యాస్ ను కొనుగోలు చేయాలి. కొన్ని రోజుల్లోనే ఈ సమస్య కొద్దిగానైనా బయటపడతామని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల ద్వారా వివిధ మార్గాలు, కొత్త ప్రాంతాల నుండి గ్యాస్ వచ్చే అవకాశం ఉంది. హోటల్ పరిశ్రమ వాణిజ్య గ్యాస్ డీలర్స్ కు మధ్య ప్రధాన భాగస్వామ్యం ఉంది. హోటల్ పరిశ్రమపై వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమ మూతపడితే దాని ప్రభావం సమాజంపైన, ప్రభుత్వంపైన కూడా అధికంగా ఉంటుందని అన్నారు.

ఇప్పుడు సరఫరా చేసే గ్యాస్ పైన ఎలాంటి డిస్కౌంట్ ఉండదు. ఎందుకంటే ఇప్పుడు చాలా తక్కువ మార్జిన్ పైన వ్యాపారం జరుగుతుంది. తప్పకుండా గ్యాస్ వినియోగం 30నుండి 40 శాతం తగ్గించి వాడాలని అన్నారు.

# జాబ్ క్యాలెండర్ బౌన్స్ అయింది

## నిరుద్యోగులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు

### బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి

హైదరాబాద్ మార్చి 13, (

ప్రభుత్వం ప్రజా పాలన,ప్రగతి ప్రోగ్రామ్ కింద 99 రోజుల ప్రణాళిక చేపట్టింది. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల కోసం ఒక్క రోజు చర్చించక పోవడం దురదృష్టకరం. రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగులకు ఆశలు కల్పించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో 2 లక్షల ఉద్యోగాలు సంవత్సరానికి ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే పోరాటం చేస్తున్న వారి తలలు పగలగొడుతున్నాదని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు.

యూపీఎస్సి కొత్త నిబంధనతో నెల రోజులు ఆలస్యంగా నోటిఫికేషన్ ఇచ్చింది. జ్యుడీషియరీ వ్యవస్థలో సంస్కరణలు వచ్చాయి. ఏపీ ప్రభుత్వం ఇటీవల కొత్త నిబంధన తెచ్చింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యపై కమిటీ వేసింది. తెలంగాణ ప్రభుత్వం సిలబస్ కమిటీ వేసి సంవత్సరం అయినా ఉలుకు,పలుకు లేదు. నిరుద్యోగ సమస్య ప్రభుత్వానికి ప్రయారిటీ లేదు. ఉద్యోగాల పేరుతో ప్రభుత్వం నాటకాలాడుతోంది. రాష్ట్రంలో నిరుద్యోగ యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జాబ్ క్యాలెండర్ అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి ప్రవేశ పెడితే ఇప్పటి వరకు దిక్కు లేదు. జాబ్ క్యాలెండర్ బౌన్స్ అయింది. వీళ్ళు సిపాయిలు అయినట్లు మూసీని ప్రక్షాళన చేసి నైట్ ఎకానమీ తయారు చేస్తారు అంట. ప్రయివేటు ఉద్యోగాలపై ప్రభుత్వం పాలసీ ఏంటి...? కేసీఆర్ హయాంలో ఐటీ ఉద్యోగాలు 10 లక్షలు కొత్తగా వచ్చాయి. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రతి రెండు ఏళ్లకు ఒక సారి పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. చివరిగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2022లో పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. నిరుద్యోగుల పుణ్యంతోనే ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యారు. దిల్ సుఖ్ నగర్ లో ఆందోళన చేసిన నిరుద్యోగులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. నిరుద్యోగులు రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ మెట్లు ఎక్కే విధంగా చేశారు. రేవంత్ రెడ్డి నిరుద్యోగులను పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిస్తున్నారు. రేవంత్ రెడ్డి తన ప్రభుత్వాన్ని,పాలనను అప్ డేట్ చేసుకోవాలని అన్నారు.

# ఎంఎస్ఎంఈ ఎక్స్ పో ను ప్రారంభించిన ఎంపి చిన్ని

విజయవాడ మార్చి 13, (

లబ్బీపేట ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ లో ఏపీ ఎంఎస్ఎంఈ ఎక్స్ పో - 2026 ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ రావు ప్రారంభించారు. ఎక్స్ పో లో స్టాల్స్ ను పరిశీలించారు.

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమలు వృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తోంది. ప్రతి ఇంట్లోనూ ఒక పారిశ్రామికవేత్త ఉండాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం. ఎంఎస్ఎంఈ సంస్థల బలోపేతంతోనే అది సాధ్యపడుతుంది. ఈ సంస్థలు బలోపేతం చెందడం ద్వారా యువతకు ఉపాధి కల్పన లభిస్తుంది. ఈ ఎక్స్పో -2026 ను ఏర్పాటు చేసి రాష్ట్రీయ ఉత్పత్తుల ను స్టాల్స్ ద్వారా ప్రదర్శనలో ఉంచటం సంతోషకరమని అన్నారు.

రానున్న కాలంలో జగ్గయ్యపేట, మైలవరం తదితర ప్రాంతాలలో ఎబఎవ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎక్స్పోలు ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని అన్నారు.

ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి ఇంట్లోనూ ఒక పారిశ్రామికవేత్త ఉండాలంటే పరిశ్రమలు వృద్ధి చెందాలి. చిన్న మధ్యతరగతి పరిశ్రమల ద్వారానే క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పన పెరుగుతుందని అన్నారు.

# డ్రైవర్లకు కంటిచూపు ఎంతో కీలకం

## డిఫెన్స్ డ్రైవింగ్కు స్పష్టమైన దృష్టి అవసరం

## బాలనగర్ పోలీస్ స్టేషన్లో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణ

మహబూబ్ నగర్ మార్చి 13, (

బాలనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు మరియు జాతీయ రహదారి 44 మీదుగా ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి మరియు ఈ.సి.జీ పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని భవాని ఐ కేర్ మరియు విజయ కార్డిక్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్కు కంటిచూపు స్పష్టంగా ఉండటం అత్యంత ముఖ్యమని, డ్రైవింగ్ సమయంలో ఎదురుగా, పక్కన మరియు వెనుక నుంచి వచ్చే వాహనాలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని తెలిపారు. డిఫెన్స్ డ్రైవింగ్లో కంటిచూపు కీలక పాత్ర పోషిస్తుందని, కంటిచూపు మెరుగ్గా ఉంటే ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించగలుగుతారని పేర్కొన్నారు.

అదేవిధంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అలాగే సరైన లైన్ డ్రైవింగ్ పాటించడం వంటి అంశాలపై డ్రైవర్లకు పిపిటి ప్రదర్శన ద్వారా వివరించారు. డ్రైవింగ్ నైపుణ్యాలు మరియు రోడ్డు భద్రత నియమాలపై కూడా వారికి అవగాహన కల్పించారు.

ఈ శిబిరంలో బాలనగర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు మరియు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించే ఇతర భారీ వాహనాల డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు, ఇఅఉ చేయించుకున్నారు.

# పురిట బిడ్డ మృతి ?

## వైద్యుల నిర్లక్ష్యమని బంధువుల ఆందోళన

తిరుపతి మార్చి 13

వైద్యాధికారుల నిర్లక్ష్యంతో పురిట బిడ్డ మృతి చెందాడని బంధువులు ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయం ప్రసవ నొప్పులతో మహిళ తిరుపతి ప్రసూతి ఆసుపత్రిలో అడ్మిట్ అయింది. మధ్యాహ్నం మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆపై మహిళా బీపీ పెరగడంతో తల్లిని ఐసీయూ కు తరలించారు. గురువారం సాయంత్రం బిడ్డకు వైద్యులు ఇంజెక్షన్ ఇచ్చారు. ఇంజెక్షన్ వికటించడంతో శుక్రవారం తెల్లవారిజామున 2 గంటలకు శిశువు మృతి చెందిందని బంధువుల అరోపణ. బిడ్డ మృతి చెందడంపై పొంతనలేని సమాధానం ఇస్తున్నారని అన్నారు.

డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసారు. మృతి చెందిన శిశువుతో ఆసుపత్రి ఎదుట నిరసన చేసారు. నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేసారు.

# అడవుల సంరక్షణలో మీడియా పాత్ర కూడా కీలకమే

అసిఫాబాద్ మార్చి 13

అడవులను సంరక్షించడం అటవీశాఖ అధికారులు, సిబ్బందితో పాటు మీడియా పాత్ర కూడా కీలకమే అని అన్నారు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవిశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్.

కుమురంభీం జిల్లా సిర్పూర్ అటవీ రేంజ్ పరిధిలోని ఇటిక్యాల పహాడ్ గ్రామంలో అటవిశాఖ అధికారులు మరియు మీడియా ప్రాధాన్యత అనే అంశంపై వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అటవిశాఖ అధికారి మాట్లాడుతూ కుమురం భీం జిల్లాలో కవ్వాల్ టైగర్ కారిడార్ తో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్రలోని తాడోబా చత్తీస్గఢ్ లోని ఇంద్రావతి అభయారణ్యాలకు తోడు ప్రాణహిత నది ఉండడంవల్ల జిల్లాలో పెద్దపులుల సంఖ్య పెరుగడమే కాకుండా వాటి సంతానోత్పత్తికి అనుకూల వాతావరణం ఉందని అన్నారు. ఇక్కడి అటవీ ప్రాంతాన్ని తమ ఆవాస కేంద్రాలుగా అవి ఏర్పర్చుకోవడం విశేషమని తెలిపారు. అటవిశాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణలో భాగంగా ఆటవులతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# గ్యాస్ సిలిండర్ల కొరత

## అందోళనలో ప్రజలు

శ్రీకాకుళంమార్చి 13, (


సెక్స్ రాకెట్ లో మన దేశానికి చెందిన కొంతమంది పెద్దలు ఉన్నారు. వారి పేర్లు త్వరలో బయటికి రాబోతుంది. ట్రంప్ మొదలుకుని, మైక్రోసాఫ్ట్ అధినేత వరకు సెక్స్ రాకెట్ లో కూరుకుపోయారని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ అన్నారు.

ఇరాన్ దేశంలో, టెహ్రాన్ అనే ప్రాంతంలో న్యూడ్ రహస్యాలు, వీడియోలు, ఫోటోలు ఉన్నాయనే అనుమానంతో బాంబులు దాడి ప్రారంభించారు. యుద్ధం ప్రారంభించే రెండు రోజులు ముందు మన దేశ ప్రధాని ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటన ప్రజలందరూ ఆలోచించాలి. ఇరాన్ పై యుద్ధం వల్ల ప్రపంచ దేశాలు సంక్షోభంలో పడిపోయింది. మూడు నెలలకు ఒకసారి గ్యాస్ సిలిండర్ వస్తుందన్న నమ్మకం లేదు. గ్యాస్ సిలిండర్ అయిపోతే, అందుతుందో లేదో అని ఆందోళనలో దేశ ప్రజలు ఉన్నారు. ఎఫ్స్టీన్ అనే వ్యక్తి ప్రపంచ అధినేతలకు అమ్మాయిలను సప్లై చేస్తాడు. అభ్యుదయవాదులుగా ఉండాల్సిన దేశాధినేతలు సెక్స్ రాకెట్ లో ఇరుక్కోవడం గమనార్హం. ఎన్డీఏ ప్రభుత్వం ఇడ్లీ పైన, దోశలు పైన, ఇస్త్రీపైన, చిన్న చిన్న ఉద్యోగస్తులపైన పన్నులు వసూలు చేసి, యుద్ధ విమానాలు కొంటోంది.

శాంతి, సంతోషం, సుఖం, సంక్షేమం, అభివృద్ధి దేశానికి కావాలి. లక్షల కోట్లు ఖర్చుపెట్టి, యుద్ధ విమానాలు కొనడం తప్పని అన్నారు.

# ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందద్దు: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

సిద్దిపేట మార్చి 13, (



పౌర సరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ. ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు.ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు, గురుకులాలకు, వసతి గృహాలకు విద్యాసంస్థలకు,వృద్ధాశ్రమలకు, అనాధ శరణాలయాలకు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు.ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు.అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు.తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు,సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు.పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి,గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని,గృహ వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రబీ సీజన్ కు సరిపడా సాగునీరు అందుబాటులో ఉందని పంటలకు అవసరమైన నీటిని సకాలంలో రైతులకు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల దృష్టి సారించాలని ముఖ్యంగా రైతులకు అధికంగా మేలు చేసే ఆయిల్ ఫామ్ తోటల పెంపకంపై రైతులను ప్రోత్సహించాలని అన్నారు. జిల్లాల వారిగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న జిల్లాలో మరింత దృష్టి సారించలన్నారు. ఈనెల 22వ సిద్దిపేట జిల్లాలో నూతనంగా నిర్మించిన ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. రబీ సీజన్లో పండిన పంటల కొనుగోలుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హేమావతి మాట్లాడుతూ. జిల్లాలో ఎలాంటి ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వినియోగదారులకు సరైన సమయానికి గ్యాస్ డెలివరీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంస్థలైన గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడి సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎల్పిజి గ్యాస్ సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే జిల్లాలో రబీ సీజన్లో సాగునీరు సరఫరాకు ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని, రబీ కాలంలో పండిన పంటల కొనుగోలుకు ప్రణాళిక ప్రకారం ముందస్తు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో సిద్దిపేట ఆర్డీవో సదానందం, జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఇరిగేషన్ అండ్ మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు మైనర్ బాలికలపై లైంగిక దాడి

## మైనర్ బాలుడి కీచకం

నాగర్ కర్నూలు మార్చి 13,

ప్రేమ పేరుతో పలువురు మైనర్ బాలికలను మోసం చేసి అఘాయిత్యాలకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి పాల్పడ్డాడు. అఘాయిత్యాలను ఫోన్లో చిత్రీకరణ.. డబ్బు ఇవ్వాలని లేదంటే ఆ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని, వారి తల్లిదండ్రులకు కూడా పంపిస్తానని బెదిరింపులకు గురి చేసారు. కొత్తపల్లి, నాగర్ కర్నూల్, వనపర్తికి చెందిన ముగ్గురు తోటి ఇంటర్ బాలికలను ప్రేమ పేరుతో కీచకుడు లోబర్చుకున్నాడు. ఓ మైనర్ బాలిక గర్భం దాల్చగా.. కొల్లాపూర్లోని సాయి కృప ఆసుపత్రిలో ఆమెకు అబార్షన్ చేయించారు.

ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగింది. విద్యార్థి ఆగడాలను భరించలేక బాధితుల్లో ఓ విద్యార్థిని తన తల్లిదండ్రులు, బంధువులకు చెప్పుకొని ఏడ్వడంతో విషయం బైటకి పొక్కింది. బాధితురాలి తల్లిదండ్రులు ఆ బాలుడిని కొట్టి.. అతడి నుంచి ఫోన్ లాక్కుని, అనంతరం అతడిని, ఫోనును పోలీసులకు అప్పగించారు.

పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి.. జువెనైల్ హోంకు తరలించారు. కొల్లాపూర్లోని సాయి కృప ఆసుపత్రికి చెందిన ఇద్దరు వైద్యులు, ఓ నర్సును రిమాండ్ కు పంపారు.

## నాగుపాము కలకలం

మార్కాపురం

రైల్వే స్టేషన్ పరిధిలోని మహమ్మద్ నగర్ లో రాత్రి ఓ ఇంట్లో కి నాగుపాము దూరింది. బుసలు కొడుతున్న నాగుపాము ను చూసి ఇంటి వాసులు భయభ్రాంతులై కేకలు వేసింది. కాలనీ వాసులు అటవీశాఖ స్నేక్ క్యాచర్ కు సమాచారం ఇచ్చారు. బుసలు కొడుతున్న నాగుపామును చాకచకంగా పట్టుకొని సీసాలో బంధించారు.

# బద్వేల్ టిడిపి ఇన్చార్జి ఇక లాంచనమే.

## డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డికి టిడిపి ఇన్చార్జి ఖాయం? ఇంచార్జ్ పదవి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దాదాపు నిర్ణయం

బద్వేలు మార్చి 13,



మాజీ మంత్రి దివంగత వీరారెడ్డి కుటుంబం నుంచి పగ్గాలు పోయినట్లే ?బద్వేలు ఉదయం ప్రతినిధిబద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా డీసీసీబీ చైర్మన్ మంజూరు సూర్యనారాయణ రెడ్డి ఇక లాంచనమే అని చెప్పాలి సూర్యనారాయణ రెడ్డికి బద్వేల్ టిడిపి పగ్గాలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. గడచిన ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో బద్వేల్ అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఓడిపోవడం జరిగింది ఇప్పటి బద్వేలు టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ సమన్వయకర్త విజయమ్మ కుమారుడు రితేష్ రెడ్డి నియోజకవర్గంలో పార్టీని నడిపించడంలో చాలావరకు విఫలమయ్యారని అధిష్టానం గుర్తించింది తాజాగా గత శనివారం జరిగిన ముఖ్యమంత్రి సమావేశానికి కడప జిల్లా నుండి అందరూ ఎమ్మెల్యేలు పార్టీ ఇన్చార్జిలు హాజరయ్యారు కానీ బద్వేల్ నుంచి విజయమ్మ రితీష్ రెడ్డిలు హాజరు కాలేదు కారణం వారికి పిలుపు లేకపోవడమే సమావేశం జరుగుతున్న విషయం కూడా వారికి తెలియలేదు విజయమ్మ ఆమె తండ్రి దివంగత మాజీ మంత్రి వీరారెడ్డి మృతి చెందిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించలేకపోయింది ఒకప్పుడు బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది వీరారెడ్డి మృతి చెందిన తర్వాత ఆ వైభవం లేకుండా పోయింది 2009 నుంచి బద్వేలు అసెంబ్లీ రిజర్వ్ అయింది రిజర్వ్ అయిన తర్వాత తాజాగా 2024 ఎన్నికల వరకు తెలుగుదేశం పార్టీ ఓడిపోతూనే వస్తుంది 2024ఎన్నికల్లో మాజీ ఇరిగేషన్ అధికారి రోశన్న బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి ఆయనకు పూర్తి మద్దతు ఇచ్చిన ఫలితం లేకుండా పోయింది 2024 ఎన్నికల్లో కూటమి హవ రాష్ట్రమంతా వీచిన బద్వేల్ లో మాత్రం వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు కడప జిల్లాలో వైసిపి పాగా వేయకుండా చూడాలని ముఖ్యమంత్రి గట్టిగా నిర్ణయించారు అందులో భాగంగా బద్వేల్ లో టిడిపి ఇంచార్జ్ మార్పు కోసం ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిసింది బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం వేమలూరు గ్రామానికి చెందిన ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ ప్రస్తుత డీసీసీబీ చైర్మన్మంచూరు సూర్య నారాయణ రెడ్డి ని బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా నియమించేందుకు అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం శనివారం జరిగిన కడప జిల్లా పార్టీ ఎమ్మెల్యేల వద్ద బద్వేలు నియోజకవర్గ విషయంపై ప్రత్యేకంగా మాట్లాడినట్లు సమాచారం క ఇది ఇలా ఉండగా సూర్యనారాయణ రెడ్డికి డీసీసీబీ చైర్మన్ పదవి రావడంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు రితీష్ రెడ్డి ప్రమేయం ఏమాత్రం లేదని పార్టీలోని వారు చెపుతుంటారు ప్రస్తుతం పార్టీ సమన్వయకర్త రితీష్ రెడ్డి పార్టీ నడిపించడంలో విఫలమయ్యారని ఆరోపణలు ఉన్నాయి అంతేకాక వైసీపీలోని చాలామందితో ఆయనకు మంచి సంబంధం ఉన్నట్లు అధిష్టానానికి లెక్కలేనన్ని ఫిర్యాదులు అందాయి ఇది కూడా మైనస్ గా మారింది నియోజకవర్గంలోని గ్రూపులు కట్టడి చేయడంలో రితీష్ రెడ్డి విఫలమైనట్లు పార్టీ అధిష్టానం గుర్తించింది అందుకే శనివారం జరిగిన సమావేశానికి విజయమ్మ రెడ్డిలకు రాలేదు.సూర్యనారాయణరెడ్డి విజయమ్మ రితీష్ రెడ్డిలమధ్య గత ఏడు నెలలుగా తగాదాలు ఉన్నాయిరోజురోజుకు ఈ విభేదాలు మరింతగా పెరిగిపోయాయి ఈ నేపథ్యంలో టిడిపి ఇన్చార్జిగా సూర్యనారాయణ రెడ్డికి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానం దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చింది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి దివంగత మంత్రి వీరారెడ్డి పార్టీకి ఎంతో సేవలందించారు బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా చేశారు ఆయన చనిపోయిన తర్వాత ఆ వైభవం ఇప్పుడు లేకుండా పోయింది. బద్వేల్ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ వరుసగా ఓడిపోవడం పార్టీ అధిష్టానం చాలా సీరియస్ గా తీసుకుంది. అందులో భాగంగానే పార్టీ ఇన్చార్జి మార్చాలని నిర్ణయించారు. డీసీసీబీ చైర్మన్ మంజూరు సూర్యనారాయణ రెడ్డి కి ఇంచార్జ్ పగ్గాలు ఇచ్చేందుకు అధిష్టానం దాదాపుగా నిర్ణయించింది మృదు స్వభావి అందర్నీ కలుపుకు వెళ్లే సూర్యనారాయణ రెడ్డి అయితేనే బద్వేల్ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీకి న్యాయం జరుగుతుందని అధిష్టానం నిర్ణయించింది ఇంచార్జ్ పగ్గాలు చ చేపట్టేందుకు సూర్యనారాయణ రెడ్డి సుముఖంగా ఉన్నారు.

# సమాజంలో నిర్ణయాత్మక శక్తిగా ఆర్యవైశ్యులు'

## 22న వాసవి మాత పారాయణం


హైదరాబాద్ మార్చి 13, (

ఆర్యవైశ్యులు రాజకీయాలను, జయాపజయాలను ప్రభావితం చేయగల నిర్ణయాత్మక శక్తులని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వారు రాజకీయాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో వాసవి మహాశక్తి మహోత్సవం పేరిట 'వాసవి మాత పారాయణం' ఈనెల 22న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్నారు. 21 వేల పైచిలుకు భక్తులతో నిర్వహించే ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఎక్కనుంది. వాసవి మాత పారాయణం కార్యక్రమా నికి సంబంధించిన ముందస్తు పరిచయ కార్యక్రమం బంజారాహిల్స్లోని ఓ హోటల్లో జరిగింది. మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమం లోగో, పోస్టర్ను ఆవిష్కరించారు. ఐఅండ్పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ.. వాసవి మహాశక్తి మహోత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా మాట్లాడుతూ.. 21 వేల మందితో నిర్వహించే సామూహిక పారాయణానికి వైశ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. పారాయణంలో దాదాపు 35 వేల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా టీవీల్లో దాదాపు 25 వేల మందికి పైగా వీక్షకులు పాల్గొంటారని తెలిపారు.

# పదవ తరగతి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

## పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలి

కౌతాళం మార్చి 13,



మండల కేంద్రంలో 16వ తేదీ నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కౌతాళం మండల విద్యాశాఖ అధికారి శోభారాణి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఈరేష్ మండల కార్యదర్శి సాయి వర్మ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పదవ తరగతి పరీక్షల సమయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద చల్లని త్రాగునీటి సౌకర్యం కల్పించాలి అలాగే పరీక్షా గదుల్లో విద్యార్థులకు సరిపడా వెలుతురు ఉండాలని, ఫ్యాన్లు తిరిగేలా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని,గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల కోసం పరీక్షా సమయాలకు అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు నడపాలి వారు విజ్ఞప్తి చేశారు.విద్యార్థులకు మెరుగైన సౌకర్యం కల్పించలేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు అనివేష్ నాయకులు రాము తేజు పాల్గొన్నారు.స్పందించిన మండల విద్యాశాఖ అధికారికౌతాళం మండలంలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రతి పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా బెంచీలు కుర్చీలు ఏర్పాటు చేస్తున్నామని, పరీక్ష గదులలో ఫ్యాన్లు లైట్ల తో పాటు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు మరియు పరీక్ష కేంద్రాలలో ప్రథమ చికిత్సల కొరకు సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

# జీవితాన్ని తగ్గించే 18 చెడు అలవాట్లు

## డాక్టర్. వి. శ్రావణ్ కుమార్ మెడికేర్ హాస్పిటల్ హుస్నాబాద్ రోడ్ కోహెడ

కోహెడ మార్చి 13

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కోహెడ గ్రామ నివాసి డాక్టర్.వి.శ్రావణ్ కుమార్ మెడి కేర్ హాస్పిటల్ హుస్నాబాద్ రోడ్ కోహెడ మాట్లాడుతూ మన ఆరోగ్యం మరియు ఆయుష్షు మన జీవనశైలిపై చాలా వరకు ఆధారపడి ఉంటుంది.చిన్నగా కనిపించే కొన్ని చెడు అలవాట్లు క్రమంగా మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.వాటిని ఎక్కువ కాలం కొనసాగిస్తే గుండె, మెదడు, జీర్ణక్రియ వంటి అనేక అవయవాలపై ప్రభావం పడుతుంది.అందుకే ఆరోగ్యానికి హానికరమైన అలవాట్లను ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం:

వాటిని మార్చుకోవడం ద్వారా మన జీవితం ఆరోగ్యంగా మరియు దీర్ఘకాలం కొనసాగుతుంది.ఇ

ప్పుడు జీవితాన్ని తగ్గించే కొన్ని ముఖ్యమైన అలవాట్ల గురించి తెలుసుకుందాం:

రోజూ 6 గంటల కంటే తక్కువ నిద్రపోవడం:రోజుకు సరిపడా నిద్ర లేకపోతే శరీరం అలసటకు గురవుతుంది.మెదడు విశ్రాంతి పొందకపోవడం వల్ల ఆలోచనా శక్తి తగ్గుతుంది.ఇది గుండె జబ్బులు మరియు రక్తపోటు ప్రమాదాన్ని పెంచుతుంది.హార్మోన్ల అసమతుల్యత కూడా కలుగుతుంది.రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది.దీని వల్ల చిన్న చిన్న వ్యాధులు కూడా త్వరగా వస్తాయి.ప్రతి రోజు కనీసం 7–8 గంటలు నిద్రపోవడం అవసరం.ప్రతిరోజూ జంక్ ఫుడ్ తినడం:జంక్ ఫుడ్‌లో అధిక కొవ్వు, ఉప్పు మరియు చక్కెర ఉంటుంది.ఇవి శరీరంలో కొవ్వును పెంచి ఊబకాయం కలిగిస్తాయి.గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.జీర్ణక్రియ కూడా సరిగా ఉండదు.విటమిన్లు మరియు పోషకాలు శరీరానికి తక్కువగా అందుతాయి.దీని వల్ల శక్తి తగ్గుతుంది.ఇంట్లో తయారైన ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం మంచిది అని.. డాక్టర్. వి. శ్రావణ్ కుమార్ మెడికేర్ హాస్పిటల్ హుస్నాబాద్ రోడ్ కోహెడ అన్నారు.చిన్న విషయాలకు ఎక్కువగా ఆందోళన చెందడం:చిన్న విషయాలను కూడా పెద్ద సమస్యలుగా భావించడం ఒత్తిడిని పెంచుతుంది,మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది,రక్తపోటు పెరిగే అవకాశం ఉంటుంది,నిద్రలేమి సమస్య కూడా వస్తుంది,మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండదు.శరీరంలో హార్మోన్ల సమతుల్యత కూడా మారుతుంది.సానుకూల ఆలోచనలు అలవాటు చేసుకోవాలి.ధూమపానం చేయడం:సిగరెట్ లేదా ఇతర ధూమపానం అలవాట్లు ఊపిరితిత్తులను తీవ్రంగా దెబ్బతీస్తాయి,ఫెఫుసు క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.గుండె సంబంధిత వ్యాధులు కూడా రావచ్చు.రక్తప్రసరణ సరిగా జరగదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలుగుతాయి. ఇది జీవితకాలాన్ని తగ్గిస్తుంది.ధూమపానం పూర్తిగా మానడం అత్యంత మంచిది.అధికంగా మద్యం సేవించడం:మద్యం ఎక్కువగా తాగడం కాలేయాన్ని దెబ్బతీస్తుంది,లివర్ సిరోసిస్ వంటి వ్యాధులు రావచ్చు.గుండె మరియు మెదడుపై కూడా ప్రభావం పడుతుంది. మనసు మరియు ప్రవర్తనలో మార్పులు వస్తాయి.శరీరానికి అవసరమైన పోషకాలు తగ్గుతాయి.ఇది అనేక ప్రమాదాలకు దారితీస్తుంది.మద్యం సేవించడం తగ్గించడం లేదా పూర్తిగా మానడం మంచిది.కోపాన్ని ఎక్కువగా పట్టుకోవడం:ఎప్పుడూ కోపంగా ఉండడం ఆరోగ్యానికి హానికరం.ఇది రక్తపోటును పెంచుతుంది,మనసులో ఒత్తిడి పెరుగుతుంది.సంబంధాలు కూడా దెబ్బతింటాయి.గుండెపై కూడా ప్రభావం పడుతుంది,మనసు ప్రశాంతంగా ఉండదు,క్షమించడం నేర్చుకోవడం ఆరోగ్యానికి మంచిది.ఎక్కువసేపు కూర్చోవడం: రోజంతా కూర్చునే అలవాటు శరీరానికి మంచిది కాదు.ఇది ఊబకాయం ప్రమాదాన్ని పెంచుతుంది.రక్తప్రసరణ సరిగా జరగదు.గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.కాళ్లలో నొప్పి మరియు వెన్నునొప్పి వస్తాయి.శక్తి తగ్గిపోతుంది.ప్రతి గంటకు కొంతసేపు నడవడం మంచిది.ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయడం:నియమిత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం.అవి వ్యాధులను ముందుగానే గుర్తించడానికి సహాయపడతాయి.పరీక్షలు చేయించుకోకపోతే సమస్యలు ఆలస్యంగా తెలుస్తాయి.ఇది చికిత్సను కష్టతరం చేస్తుంది.డయాబెటిస్, బీపీ వంటి వ్యాధులు దాచుకుని ఉండవచ్చు.సమయానికి పరీక్షలు చేయించుకుంటే ప్రమాదం తగ్గుతుంది.ప్రతి సంవత్సరం కనీసం ఒకసారి పరీక్షలు చేయించాలి.ఆకలి లేకపోయినా ఎక్కువగా తినడం:అవసరం లేకపోయినా తినడం శరీరానికి హానికరం. ఇది ఊబకాయం సమస్యకు దారితీస్తుంది.జీర్ణక్రియపై కూడా ప్రభావం పడుతుంది.చక్కెర మరియు కొవ్వు స్థాయిలు పెరుగుతాయి.గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.ఆహారం నియంత్రణ చాలా ముఖ్యం.ఆకలి ఉన్నప్పుడు మాత్రమే తినాలి.మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం:మనసు ఆరోగ్యంగా ఉండటం కూడా చాలా ముఖ్యం.ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు.ఇవి శరీర ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతాయి.నిద్రలేమి సమస్యలు వస్తాయి.జీవితంపై ఆసక్తి తగ్గిపోతుంది.సమయానికి సహాయం తీసుకోవడం అవసరం.ధ్యానం మరియు వ్యాయామం సహాయపడతాయి.రోజంతా నీరు తక్కువగా తాగడం:శరీరానికి సరిపడా నీరు అవసరం.నీరు తక్కువగా తాగితే డీహైడ్రేషన్ వస్తుంది.శక్తి తగ్గిపోతుంది.జీర్ణక్రియ సరిగా ఉండదు.చర్మం పొడిగా మారుతుంది.కిడ్నీలపై కూడా ప్రభావం పడుతుంది.రోజుకు సరిపడా నీరు తాగాలి.చెడు వ్యక్తులతో ఎక్కువ సమయం గడపడం:నెగటివ్ ఆలోచనలు ఉన్న వ్యక్తులతో ఉండటం మనసుపై ప్రభావం చూపుతుంది.మనలో కూడా నిరుత్సాహం పెరుగుతుంది.ఆత్మవిశ్వాసం తగ్గిపోతుంది. ఒత్తిడి పెరుగుతుంది.జీవితంపై దృష్టి మారుతుంది.సానుకూల వ్యక్తులతో ఉండటం మంచిది.అది మనసుకు ఆనందాన్ని ఇస్తుంది.దీర్ఘకాల నొప్పులను పట్టించుకోకపోవడం:శరీరంలో నొప్పి ఎక్కువకాలం ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు,అది పెద్ద వ్యాధికి సంకేతం కావచ్చు.ముందుగా గుర్తిస్తే చికిత్స సులభం.ఆలస్యం చేస్తే సమస్య పెరుగుతుంది.జీవనశైలిపై కూడా ప్రభావం పడుతుంది.వైద్యుడిని సంప్రదించడం అవసరం.సమయానికి చికిత్స తీసుకోవాలి.తప్పు కూర్చునే విధానం:తప్పు భంగిమలో కూర్చోవడం వెన్నునొప్పికి కారణం అవుతుంది.మెడ మరియు భుజాలకు ఒత్తిడి పెరుగుతుంది.దీర్ఘకాలంలో వెన్నెముకపై ప్రభావం పడుతుంది.శరీర నిర్మాణం కూడా మారుతుంది.శరీరం త్వరగా అలసిపోతుంది.సరైన భంగిమలో కూర్చోవడం అవసరం.ఇది ఆరోగ్యాన్ని కాపాడుతుంది.విశ్రాంతి లేకుండా ఎక్కువగా పని చేయడం:శరీరానికి విశ్రాంతి అవసరం..ఎక్కువ పని ఒత్తిడిని పెంచుతుంది.మెదడు అలసిపోతుంది.నిద్రలేమి సమస్యలు వస్తాయి.గుండెపై కూడా ప్రభావం పడుతుంది.పని మరియు విశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం.అప్పుడే ఆరోగ్యం కాపాడబడుతుంది.కాలుష్యానికి ఎక్కువగా గురవడం:కాలుష్యమైన గాలి ఆరోగ్యానికి ప్రమాదకరం.ఇది ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది.శ్వాసకోశ సమస్యలు వస్తాయి.అలర్జీలు పెరుగుతాయి.దీర్ఘకాలంలో తీవ్రమైన వ్యాధులు రావచ్చు.అవసరమైనప్పుడు మాస్క్ ఉపయోగించాలి.శుభ్రమైన వాతావరణంలో ఉండటం మంచిది.వ్యాయామం చేయకపోవడం:వ్యాయామం చేయకపోతే శరీరం బలహీనపడుతుంది.ఊబకాయం పెరుగుతుంది.గుండె ఆరోగ్యం



దెబ్బతింటుంది.శక్తి తగ్గిపోతుంది.మనసు కూడా అలసిపోతుంది.రోజుకు కనీసం కొంతసేపు వ్యాయామం అవసరం..ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.సంతులిత ఆహారం తీసుకోకపోవడం:సంతులిత ఆహారం ఆరోగ్యానికి చాలా అవసరం. పోషకాలు తక్కువగా తీసుకుంటే శరీరం బలహీనపడుతుంది.విటమిన్ లోపాలు వస్తాయి. రోగనిరోధక శక్తి తగ్గుతుంది.శక్తి తగ్గిపోతుంది.పండ్లు, కూరగాయలు, ధాన్యాలు తీసుకోవాలి.అప్పుడే ఆరోగ్యం బలంగా ఉంటుంది.మన జీవనశైలిలో ఉన్న చిన్న చిన్న చెడు అలవాట్లు కూడా ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి.వాటిని గుర్తించి మార్చుకోవడం చాలా అవసరం..ఆరోగ్యకరమైన అలవాట్లు పెంచుకుంటే జీవితకాలం పెరుగుతుంది..సమతులిత ఆహారం, వ్యాయామం మరియు మంచి నిద్ర ఆరోగ్యానికి కీలకం.మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది..ఇప్పటి నుంచే మంచి అలవాట్లను ప్రారంభించండి. అప్పుడు ఆరోగ్యకరమైన మరియు సంతోషకరమైన జీవితం సాధ్యమవుతుంది.. డాక్టర్. వి. శ్రావణ్ కుమార్ మెడికేర్ హాస్పిటల్ హుస్నాబాద్ రోడ్ కోహెడ తెలిపారు.

# తిరుపతిలో ఎస్ ఎస్ సి స్పాట్ వాల్యుయేషన్ కోడింగ్ సిస్టమ్‌పై ప్రాంతీయ స్థాయి అవగాహన సదస్సు...

**పది పరీక్షల మూల్యాంకనంలో కోడింగ్ విధానం అత్యంత కీలకం......**

**పారదర్శకమైన ఫలితాల కోసం కోడింగ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి...**

**ఆర్జేడీ శ్యామ్యూల్....డీఈఓ కేవీఎన్ కుమార్...**

తిరుపతి మార్చి 13.




తిరుపతి జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నందు ఎస్ ఎస్ సి ఏ పీ ఓ ఎస్ ఎస్ పబ్లిక్ పరీక్షలు ? మార్చి 2026 సందర్భంగా స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్‌కు సంబంధించిన జోన్ ?4 ప్రాంతీయ స్థాయి ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి అతిథులుగా కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్యామూల్ , తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ , సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణప్ప పాల్గొన్నారు.ఈ సందర్భంగా రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్యామ్యూల్ మాట్లాడుతూ, ఎస్ఎస్సి స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియలో అమలు చేసే కోడింగ్ సిస్టమ్ అత్యంత కీలకమైనదని తెలిపారు. కోడింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి కోడింగ్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షల మూల్యాంకనం పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.అలాగే తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ, స్పాట్ వాల్యుయేషన్‌లో కోడింగ్ సిస్టమ్ సరిగ్గా అమలు కావడం విద్యార్థుల ఫలితాల ఖచ్చితత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కోడింగ్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి, నిర్దేశిత విధానాలను కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమానికి ఎనిమిది జిల్లాల నుండి వచ్చిన కోడింగ్ సిబ్బంది హాజరై స్పాట్ వాల్యుయేషన్ విధానాలు, జాగ్రత్తలు మరియు మెళుకువలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (పబ్లిక్ ఎగ్జామ్స్) సుధ ,డి వై ఈ ఓ లు, తదితర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన అంశాలను సమగ్ర సి ఎం ఓ సురేష్ మరియు వేణుగోపాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి తెలియజేసి రిసోర్స్ పర్సన్ లుగా వ్యవహరించారు.

# అడుసు పాలెం జగనన్న లేఅవుట్లో పేదల ఇళ్లపై కాలువ వేటు...

**రేణిగుంట అడుసు పాలెం జగనన్న లేఅవుట్లో సాగునీటి కాలువ తవ్వకాలపై నిరసన...**

**కాలువ తవ్వకం వల్ల సుమారు 43 ఇళ్లు కోల్పోయే ప్రమాదం....**

**ఇళ్ల స్థలాల పక్కన కాలువ తీయడంపై కాలనీవాసుల తీవ్ర అభ్యంతరం...**

**జగనన్న లేఅవుట్ మ్యాప్ లో కాలువ ఉందంటూ న రెవెన్యూ సిబ్బంది...**

**రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని స్థానికుల ఆవేదన..**

రేణిగుంట మార్చి 13



రేణిగుంట మండలం అడుసుపాలెం పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో పేదల కలల ఇళ్లపై సాగునీటి కాలువ వేటు పడనుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన ఈ లేఅవుట్‌లో ప్రస్తుతం సాగునీటి కాలువ తవ్వకం పనులు స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. లేఅవుట్ మ్యాప్‌లో కాలువ ఉందని సాకు చూపుతూ అధికారులు చేపడుతున్న ఈ తవ్వకాల వల్ల సుమారు 43 కుటుంబాలు తమ నిలువనీడను కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.?తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల పక్కనే, నిబంధనలకు విరుద్ధంగా కాలువ తీయడంపై కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఏకపక్ష నిర్ణయం వల్ల నిర్మించుకున్న ఇళ్లు దెబ్బతినడమే కాకుండా, రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, మరోవైపు కాలువ తవ్వకాల పేరుతో వారి ఆశలను చిదిమేయడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు.?ఈ కాలువ పనుల వల్ల తమ ఇళ్లకు పగుళ్లు వచ్చే అవకాశం ఉందని, వర్షాకాలంలో నీరు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, మ్యాప్‌లో ఉన్న లోపాలను సరిదిద్ది, పేదల ఇళ్లకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు

# ఎస్సార్ నగర్లోని దుర్గా హాస్టల్లో కట్టెల పొయ్యిపై వంట

హైదరాబాద్హైదరాబాద్లోని ఎస్సార్ నగర్ ప్రాంతంలోని దుర్గా హాస్టల్లో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో హాస్టల్ సిబ్బంది కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. గ్యాస్ సరఫరా లేకపోవడంతో హాస్టల్ యాజమాన్యం తాత్కాలికంగా పాతకాలం తరహాలో కట్టెల పొయ్యిని ఉపయోగిస్తూ వంట నిర్వహిస్తున్నారు.విద్యార్థులకు భోజనం అందించడంలో అంతరాయం రాకుండా ఉండేందుకు సిబ్బంది ఈ విధంగా వంట చేయాల్సి వస్తోంది. పాత కాలంలో ఎలా అయితే కట్టెల పొయ్యిపై వంట చేసేవారో అదే పద్ధతిలో ప్రస్తుతం వంట జరుగుతోంది. గ్యాస్ సిలిండర్లు త్వరగా అందుబాటులోకి వస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని హాస్టల్ సిబ్బంది చెబుతున్నారు.

# యనమలకుదురు దేవాలయం చోరీ కేసు పరారీలో ఈవో భవాని

విజయవాడ మార్చి 13.

యనమలకుదురు శివాలయంలో నగదు మాయంపై దేవదాయ శాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. ఆలయ ఈవో, అర్చకులు కలిసి రూ.10 లక్షలకు పైగా నగదు మాయం చేసిన వైనం తెలిసిందే. అంతరాలయం హుండీ మారు తాళం తయారు చేసి నగదు చోరీ జరిగింది. పంపకాల్లో తేడా రావడంతో.. హుండీ దొంగలు మద్యం దుకాణంలో పంచాయితీ పెట్టుకున్నారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ సంగా నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయింది. ఇద్దరు పూజారులతో పాటు మరొకరిని పోలీసులు అరెస్ట్ చేసారు. ఆలయ ఈవో భవానీ పరారీలో వున్నారు. అధికారులు చోరీ పై పూర్తి విచారణ చేసి దేవాదాయశాఖ కమిషనర్ కు రిపోర్టు పంపారు. ఈవో భవానీ స్థానంలో కానూరుకు చెందిన మరో ఈవోను నియమించారు.

# ఎల్ పిజీ గ్యాస్ సిలిండర్లపై, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: కామారెడ్డి జిల్లా శుక్రవారం శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఎల్ పిజీ లభ్యతను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు , డిస్ట్రిబ్యూటర్లతో సమన్వయం చేసుకొని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నిల్వ కేంద్రాలు , డిస్ట్రిబ్యూటర్ల గోదాముల్లో ఎల్. పి.జీ స్టాక్ పరిస్థితిని ప్రతిరోజూ సమీక్షించడంతో పాటు నిల్వ ఉంచడం, మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్ , అనధికార వినియోగాన్ని కట్టడి చేయాలని సూచించారు. అవసరమైతే ఎసెన్షియల్ కమోడిటిఎస్ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ ఌ జిల్లా మేజిస్ట్రేట్ చైర్మన్‌గా, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కన్వీనర్‌గా ఉండగా, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, విద్యా శాఖ, సంక్షేమ శాఖలు, ఎల్. పి.జీ డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్. పి.జీ డిస్ట్రిబ్యూటర్లు వారి డెలివరీ సిబ్బంది వినియోగదారుల నుండి అదనపు ధరలు వసూలు చేయకూడదని, వినియోగదారులకు సరిపడా ఎల్ .పి.జీ సిలిండర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సంక్షేమ సంస్థలు తమ వద్ద ఉన్న ఎల్. పి.జీ స్టాక్ లభ్యతను ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు.

గృహ వినియోగ ఎల్. పి.జీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగించడం, నిల్వ ఉంచడం (హోర్డింగ్) వంటి చర్యలను కట్టడి చేయాలని, అలాంటి వారిపై ఎసెన్షియల్ కమోడిటిఎస్ యాక్ట్, 1955 లోని సెక్షన్ 6ఎ కింద కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

లిలిఅంతకుముందులి

రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్ట్యా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి లు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని, గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.

సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు.

ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు , విద్యాసంస్థలకు, వృద్ధాశ్రమాలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు.

ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన తెలిపారు.

అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు.

తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం, అక్రమంగా మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడిన వారిని ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు. ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు, ఎస్.పి లు, పోలీస్ కమీషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు.

పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి, గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు.

అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని, ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు

## -ఆందోళన చెందాల్సిన అవసరం లేదు-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 13:

సూర్యాపేట జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ లకు ఎలాంటి కొరతలేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.

శుక్రవారం అయన అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల అధికారులతో ఎల్పిజి గ్యాస్ సరఫరాపై సమావేశం నిర్వహించారు.గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరా లో ఏలాంటి కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.సూర్యాపేట జిల్లాల్ 4, 15, 509 డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయని ప్రస్తుతం జిల్లాలో 17, 647 డొమెస్టిక్ సిలిండర్లు,న552 కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సకాలంలో డెలివరీ చేయడం జరుగుతుందని వివరించారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు ఉపశమనం వైపు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ను ఎవరైనా కమర్షియల్ గా వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరతలేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. సీనియారిటీ ప్రకారం ఏజెన్సీలు గ్యాస్ ను సరఫరా చేయడం జరుగుతున్నదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సరిపోయినంతగా ఉందని కలెక్టర్ మరోసారి చెప్పారు. గ్యాస్ బుకింగ్ కు సంబంధించి సర్వర్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయమై సంబంధిత గ్యాస్ ఏజెన్సీ లతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే సర్వర్ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎవరైనా ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్

కె సీతారామారావు, జిల్లా పౌర సరఫరా అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై రాము, తదితరులు పాల్గొన్నారు.

# మంకీ ప్రొటెక్షన్ గ్రిల్స్ ను ప్రారంభించిన- పటేల్ రమేష్ రెడ్డి



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 13:

తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామంలో గల కస్తూరిబా బాలికల పాఠశాలలో మంకీ ప్రొటెక్షన్ గ్రిల్స్ ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రమేష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థినీల భద్రతను దృష్టిలో పెట్టుకొని, స్ప్రెడ్ ఇంటర్నేషనల్ సంస్థ చైర్మన్ పటేల్ శ్రీధర్ రెడ్డి సహకారంతో సుమారు1,20,000లి వ్యయంతో ఈ మంకీ ప్రొటెక్షన్ గ్రిల్స్ నిర్మించారు. పాఠశాలలో కోతుల సమస్య వల్ల విద్యార్థినులు ఇబ్బందులు పడకుండా ఉ ఒడేందుకు ఈ గ్రిల్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రమేష్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల భద్రత విద్యాభివృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని రమేష్ రెడ్డి పేర్కొన్నారు.

అదేవిధంగా,రేపు జరగబోయే రేపు టెన్త్ పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని సూర్యాపేట జిల్లా కలెక్టర్ విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లు (ప్యాడ్స్, పెన్స్) పంపిణీ చేయడం జరిగింది. ఈ కిట్లను రమేష్ రెడ్డి స్వయంగా విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థినులు కష్టపడి చదివి పరీక్షలను ధైర్యంగా రాయాలని, మంచి ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ జి సి డి ఓ పూలన్ దేవి గారు, పాఠశాల సిబ్బంది,వార్డు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# జిల్లాలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చెయ్యండి : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 13 (భారతశక్తి) : గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి, జిల్లాలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గ్యాస్ సిలిండర్ల పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే ఈ దుస్థితి ఏర్పడిందని,గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు,ఆశ్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని, అమెరికా–ఇరాన్ కు మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్టా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లోమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.

సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు.

ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు,విద్యాసంస్థలకు,

వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు.ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు.అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు.తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమీషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు.పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి , గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు.

అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ యాసంగి ధాన్యం సేకరణ కు గన్నీలు,ధాన్యం నిల్వ కు స్పేస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.జిల్లాలలో వరి సాగు పెరిగిందని,పంటల స్థితి గతులు ననుసరించి సాగు నీరు అందిస్తూ వైవిధ్యత పంటలను ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలకు అవసరమైన మేరకు స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. అలాగే జిల్లాలో రైతులకు సరిపడిన సాగునీరు అందుబాటులో ఉందని





చెప్పారు.అసత్య ప్రచారాలను ఆసరాగా చేసుకుని బ్లాక్ మార్కెటింగ్ చేసిన సిలిండర్లను ఉద్దేశపూర్వకంగా బ్లాక్ చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, డి సి ఎస్ ఓ ఫైజల్ హుస్సేన్, ఇరిగేషన్ ఈ ఈ అప్పలనాయుడు, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్లూర్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం అడ్లూర్––ఎల్లారెడ్డి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ అధికారుల ద్వారా అడ్లూర్ శివారులో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేసి తగు సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా అధికారులు నేషనల్ హైవే పైన ఉన్న డాబా హోటళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. హైవే పైన ఉన్న అన్ని డాబా హోటళ్లకు పంచాయతీ కార్యదర్శులు (పిఎస్ఎస్) నోటీసులు జారీ చేసి, వారికి సంబంధిత లైసెన్సులు ఉన్నాయా లేదా, అలాగే నేషనల్ హైవే అధికారుల అనుమతి తీసుకున్నారా లేదా అనే విషయాలను పరిశీలించాలని ఆదేశించారు.

కలెక్టర్ అప్పీల్: ప్రయాణికులు, ప్రజలు నేషనల్ హైవే పైన ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్, ఫుడ్ వేస్టేజ్, పేపర్ వేస్టేజ్ వంటి చెత్తను వేయకుండా రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా గ్రామపంచాయతీలు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



అదేవిధంగా నేషనల్ హైవే పైన ఉన్న డాబా హోటళ్లను పంచాయతీ కార్యదర్శులు (పిఎస్), ఎంపీఓ, ఎంపీడీవోలు సంయుక్తంగా తనిఖీ చేసి, నేషనల్ హైవే అనుమతులు , గ్రామపంచాయతీ అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని ఆదేశించారు. హోటళ్ల నుండి వచ్చే చెత్తను రోడ్డుపై వేస్తే సంబంధిత గ్రామపంచాయతీలు అధిక మొత్తంలో జరిమానాలు విధించాలని కలెక్టర్ ఆదేశించారు.

## హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు 29 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 13: నిర్మల్ పట్టణంలోని పలు హోటళ్లలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గృహ అవసరాల కోసం కేటాయించిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారనే సమాచారంతో ఈ జల్లెడ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

పట్టణంలోని మొత్తం 16 హోటళ్లలో తనిఖీలు నిర్వహించగా, గృహ వినియోగానికి కేటాయించిన 29 డొమెస్టిక్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాల కోసం వినియోగించడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ గృహ అవసరాల కోసం ఇచ్చే సిలిండర్లను వ్యాపార అవసరాలకు ఉపయోగించరాదని హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు.







## కేంద్ర భారీ పరిశ్రమలు ఉ ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ని దేశ రాజధాని ఢిల్లీలో కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: కామారెడ్డిలో పారిశ్రామిక వాడ (ఇండస్ట్రియల్ కారిడార్) కావాలని కేంద్ర భారీ పరిశ్రమలు ఉ ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ని దేశ రాజధాని ఢిల్లీలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కలిసారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చెయటమే కాకుండా జిల్లా కేంద్రంతో పాటు 7 మండలాలలో యువతకి, మహిళలకి ఉపాధి అవకాశాలు పెంచే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సంఘటితంగా నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మకు విన్నవించినట్టు ఆయన తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, విద్యావంతులైన యువకులు, మహిళలకి కొదవ లేదని, వారిని భాగస్వామ్యం చేస్తూ పరిశ్రమలు నెలకొల్పితే ప్రస్తుతం ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా ఉత్పాదకత పెరిగి అభివృద్ధి చెందిన ప్రాంతంగా కామారెడ్డి ప్రాంతానికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయమై మంత్రి మౌఖిక ఆదేశాలు జారీ చేసి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎమ్ఎస్ఎమ్ఈ) ఇతర విభాగాల వారితో సమగ్ర విచారణ చేపడతామని మంత్రి సూచించినట్టు తెలిపారు.



వైయస్సార్ కడప, మార్చి 13(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ డి ఎస్ ఆర్ కన్వెన్షన్ సెంటర్ లో యోగి వేమన విశ్వవిద్యాలయం నకు సంబంధించి 11,12,13,14 వ స్నాతకోత్సవము నకు కులపతి గా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ కు వై ఎస్ ఆర్ కడప జిల్లా విమానాశ్రయం నందు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా,యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి రాజశేఖర్, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు స్వాగతం పలికారు.

## టెక్రియాల్ చెరువు వద్ద నిర్వహిస్తున్న శానిటేషన్ ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పంచాయితీ, మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని టెక్రియాల్ చెరువు వద్ద నిర్వహిస్తున్న శానిటేషన్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.



అనంతరం సదాశివ నగర్ -- క్రుప్రియాల్ హైవే ఇరుపక్కల జరుగుతున్న శానిటేషన్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

టెక్రియాల్ చెరువులో గణేష్, దుర్గాదేవి నిమజ్జనం జరిగిన ప్రదేశాలలో చెరువు పరిసర ప్రాంతాల్లో శుభ్రతను కాపాడేందుకు సంబంధిత శాఖల అధికారులు చెరువు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, శానిటేషన్ పనులు పూర్తి చేసి, ఈరోజు సాయంత్రం లోపు ఆ ప్రాంతాన్ని సమతలంగా (లెవెల్) చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల ఆరోగ్యం , పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చూడాలని ప్రజాప్రతినిధులు పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డిపిఓ మురళీ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, డిఎల్ పిఓ శ్రీనివాస్, ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ ఛైర్ పర్సన్ కాసర్ల గోదావరి, కౌన్సిలర్ కొత్తపల్లి లలిత,పంచాయతీ, మున్సిపల్ , శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో కలుషిత తాగునీటి సమస్యపై కలెక్టర్ కఠిన ఆదేశాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 13 (భారత శక్తి) రంజాన్ మాసం, రానున్న ఈద్ ఉల్ ఫితర్ మరియు ఉగాది పండుగలను దృష్టిలో ఉంచుకుని భైంసా పట్టణంలో కలుషిత తాగునీటి సమస్యపై వస్తున్న నిరంతర ఫిర్యాదులను మున్సిపల్ ప్రజాప్రతినిధులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రేయ దత్తు మరియు వైస్ చైర్మన్ మిర్జా ఇద్రిస్ బేగ్ మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీరు కలుషితంగా ఉందని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పలు కాలనీలలో ప్రజలు తాగునీటి విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు.ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వెంటనే మిషన్ భగీరథ అధికారులను అప్రమత్తం చేసి కఠిన ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని, సమస్యను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను హెచ్చరించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు భైంసా మిషన్ భగీరథ అధికారులు వెంటనే రంగంలోకి దిగి శుభ్రపరిచే పనులు, మరమ్మత్తు చర్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. కలుషిత నీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందిస్తామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ కమిషనర్ వై. నవీన్, మున్సిపల్ సిబ్బంది కౌన్సిలర్ దిలీప్‌తో పాటు మున్సిపాలిటీకి చెందిన ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## 'సూపర్ వెల్లి'... కొత్త జానర్ ట్రై చేస్తున్న ఆదా శర్మ



'ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి అదా శర్మ, ఇప్పుడు ఓ సూపర్ ఉమన్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ కొత్త చిత్రానికి 'సూపర్ వెల్లి' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు రాజేష్ బచ్చాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అదా శర్మ పాత్ర చాలా భిన్నంగా ఉండనుంది. ప్రపంచాన్ని కాపాడే సూపర్ హీరోలా కాకుండా, తన శక్తులతో ప్రపంచాన్ని నాశనం చేయాలనుకునే సోమరి, గందరగోళ స్వభావం ఉన్న పాత్రలో ఆమె కనిపించనున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్‌లో కూడా, ప్రపంచాన్ని రక్షించడం కంటే నిద్రపోవడానికే ఇష్టపడే పాత్రగా ఆమెను చూపించారు.దర్శకుడు రాజేష్ బచ్చాని మాట్లాడుతూ.. "కమాండో సినిమాలో అదా చేసిన భావనా రెడ్డి పాత్ర నాకు గుర్తుంది. ఆమెలోని సహజమైన ప్రతిభ, చురుకుదనం, హాస్యం చూశాక మా 'సూపర్ వెల్లి' పాత్రకు ఆమే సరైన ఎంపిక అనిపించింది. మూడేళ్లుగా ఈ స్క్రిప్ట్‌పై పనిచేస్తున్నాను. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాం" అని తెలిపారు.

## పిల్లల్ని కనడంపై వరలక్ష్మి శరత్ కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు



నటి వరలక్ష్మి శరత్‌కుమార్ ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. జనాభా నియంత్రణకు, ఆర్థిక స్థోమతను పిల్లలను కనడానికి ముడిపెడుతూ ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "మన దేశంలో సెక్స్ గురించి ఎవరూ మాట్లాడరు కానీ, జనాభాలో మాత్రం మనం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. పిల్లలను ఒక ఫ్యాక్టరీలా కనేస్తున్నారు, ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయని బాధపడతారు. కనే ముందే సరైన ప్లాన్ ఉండాలి కదా" అని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో ఒక బిడ్డను పెంచి, చదివించడం చాలా ఖర్చుతో కూడుకున్న పని అని, అందుకే ఇంకొకరిని పోషించే స్తోమత ఉన్నప్పుడే పిల్లలను కనాలని ఆమె సూచించారు. చాలామంది తమ పిల్లల చదువుల కోసం లేదా ఆర్థిక సాయం కోసం తన దగ్గరకు వస్తుంటారని చెప్పిన వరలక్ష్మి... "ఆ పిల్లలకు నేనేమైనా జన్మనిచ్చానా? మీ తప్పులకు నేను ఎందుకు బాధ్యత వహించాలి?" అని ప్రశ్నించారు. ఈ విషయంలో ఆమెకు ప్రియమణి, మంచు లక్ష్మి కూడా మద్దతుగా నిలిచారు.

**నెటిజన్ల భిన్నాభిప్రాయాలు:**

మద్దతుగా: "ఆమె చెప్పింది కఠినమైన నిజం. బాధ్యత లేకుండా పిల్లలను కని వారిని ఇబ్బందుల్లోకి నెట్టడం కంటే, ప్లానింగ్ ఉండటం మంచిది" అని కొందరు నెటిజన్లు ఆమెను సమర్థిస్తున్నారు. వ్యతిరేకంగా: "డబ్బు ఉన్న వారే పిల్లలను కనాలనడం అహంకారం. 40 ఏళ్లలో సెటిల్ అయ్యాక పిల్లలు పుడతారన్న గ్యారెంటీ ఏంటి?" అని కొందరు ప్రశ్నిస్తున్నారు. పేదవారికి పిల్లలను కనే హక్కు లేదా అంటూ ఆమె వ్యాఖ్యలను మరికొందరు తప్పుబడుతున్నారు.

## చరణ్ బర్త్‌డే స్పెషల్.. ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు ఒకేసారి రెండు పండగ లాంటి వార్తలు అందే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 27న చరణ్ బర్త్‌డే కానుకగా ఆయన నటిస్తున్న రెండు ప్రతిష్ఠాత్మక చిత్రాల నుంచి కీలక అప్‌డేట్స్ రానున్నట్లు టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బ్లాక్‌బస్టర్ చిత్రం 'రంగస్థలం' తర్వాత రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'RC17' తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇటీవల 'పుష్ప 2'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుకుమార్, ఈ సినిమాపై ప్రత్యేక దృష్టి సారించారు. చరణ్ పుట్టినరోజున ఈ చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌తో పాటు షూటింగ్ ప్రారంభ తేదీని కూడా ప్రకటించవచ్చని సమాచారం.

## పవన్ ఫ్యాన్స్‌కు కొత్త అనుభూతి... డాల్బీ సినిమా ఫార్మాట్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్'

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమైంది. ఈ సినిమాను అత్యుత్తమ సాంకేతికత అయిన డాల్బీ సినిమా ఫార్మాట్‌లో విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో పవన్ కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్లుగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. పవన్ కల్యాణ్‌ను ఇంతకుముందెన్నడూ చూడని అత్యుత్తమ ఫార్మాట్‌లో, డాల్బీ స్క్రీన్స్‌పై చూడటం అభిమానులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని మేకర్స్ తెలిపారు. సాధారణ థియేటర్ల కంటే డాల్బీ సినిమా ఫార్మాట్‌లో దృశ్య, శబ్ద నాణ్యత అత్యంత సహజంగా, అద్భుతంగా ఉంటుంది. ఈ సాంకేతికతతో ఉస్తాద్ భగత్ సింగ్ రానుండటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రంలో నటుడు ఆర్.పార్థిబన్ కీలక పాత్ర పోషించగా, సినిమాటోగ్రాఫర్‌గా బోస్, ఆర్ట్ డైరెక్టర్‌గా ఆనంద్ సాయి పనిచేశారు. పండుగ కానుకగా కేవలం వారం రోజుల వ్యవధిలోనే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అభిమానులు సంబరాలకు సిద్ధమవుతున్నారు.





## సినిమా

## ప్రతి సినిమా ఒక సాహసమే




బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్యధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ధురంధర్: ది రివెంజ్ విడుదలకు సిద్ధమైంది. మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఈ మూవీ పనుల్లో బిజీగా ఉన్న దర్శకుడు తన పుట్టిన రోజున కూడా సినిమాకు తుది మెరుగులు దిద్దే పనిలో ఉన్నట్లు చెప్పాడు. మొదటి భాగాన్ని సూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ఇన్నాళ్లు తన పనిపై ప్రేక్షకులు చూపిన నమ్మకానికి రుణపడి ఉంటానన్నాడు. 'మీ మెస్సేజ్ లు, పోస్టులు, స్టోరీలు చూస్తుంటే నా హృదయం నిండిపోతోంది. అందరికీ పర్సనల్ గా సమాధానం చెప్పాలని ఉన్నా కుదరడం లేదు. నేను పొందే అనుభూతి మాటల్లో చెప్పలేక పోతున్న. నిజంగా అదృష్టవంతుడిని. గ్యారంటీ లేని ఈ చిత్ర పరిశ్రమలో ప్రతి సినిమా ఒక సాహసమే' అని పేర్కొన్నాడు.

## అదిరే అప్డేట్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, లెక్కల మాస్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో సినిమా అంటే అంచనాలు ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రంగస్థలం వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరూ మళ్ళీ జతకడుతున్నారు. 'ఆర్సీ17' ప్రాజెక్ట్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. అది కూడా పుష్ప 2 వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ తర్వాత సుకుమార్ నుంచి వస్తున్న సినిమా కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే తాజాగా ఈ సినిమా ప్రకటన గురించి ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు. ఆ రోజు నుంచి అదిరిపోయే అప్డేట్ రానుందని తెలుస్తోంది. షూటింగ్ వివరాలతో పాటు కాన్సెప్ట్ పోస్టర్ బయటికొచ్చే ఛాన్స్ ఉంది. ఇదే నిజమైతే సోషల్ మీడియా షేక్ అవ్వడం ఖాయం అంటున్నారు ఫ్యాన్స్. ఇప్పటికే ఈ సినిమా కథ లాక్ అయిందని, స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తయిందని టాక్. ఇక మరోవైపు ప్రస్తుతం రామ్ చరణ్ 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది. దీంతో మెగా అభిమానులు మార్చి 27 కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

## ఆశను కోల్పోవద్దు

### విడాకుల తర్వాత హన్సిక ఫస్ట్ పోస్ట్

సౌత్‌సినీ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి హన్సిక మోత్వానీ. అయితే ఇటీవల తన పర్సనల్‌లైఫ్ క సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా ఆమె వైవాహిక జీవితంపై వస్తున్న పుకార్లకు తెరదించుతూ, భర్త సొహైల్ ఖతురియా నుంచి అధికారికంగా విడాకులు తీసుకుంది. ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు వీరికి చట్టబద్ధంగా డైవర్స్ మంజూరు చేసింది. అయితే విడాకుల ప్రక్రియ పూర్తయిన వెంటనే హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక ఇంట్రెస్టింగ్ మెసేజ్‌ను పంచుకుంది. 'చార్దీ కలా ఆల్వేస్.. ఎలాంటి కష్టకాలంలోనైనా ఆశను కోల్పోవద్దు. ధైర్యంగా ఎదుర్కొని, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతా' అంటూ పంజాబీ పదబంధాన్ని పోస్ట్ చేసింది. ఇక ప్రస్తుతం ఆమె తన సినీ కెరీర్‌పై పూర్తి దృష్టి పెట్టారు. హన్సిక చేతిలో అరడజనుకు పైగా ప్రాజెక్టులు ఉన్నాయి. రానున్న రోజుల్లో ఆమె మరిన్ని సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.



# భద్రతా అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

- అవగాహన కార్యక్రమం నిర్వహించిన సూర్యాపేట రూరల్ పోలీస్
- సామాజిక భద్రత అందరి బాధ్యత
- యువత సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి
- చిన్న వయస్సులో ప్రేమ ఆకర్షణలకు లోనై భవిష్యత్తును కోల్పోవద్దు
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా

సూర్యాపేట, మార్చి 13 (భారత శక్తి జిల్లా ప్రతినిధి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి చందన నర్సింగ్ విద్యాసంస్థల నందు భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ హాజరై విద్యార్థులకు స్వీయ నియంత్రణ, సామాజిక మాధ్యమాల ద్వారా కలిగే నష్టాలు, రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నిర్మూలన, మహిళలు, విద్యార్థుల భద్రత, డ్రగ్స్ మత్తు పదార్థాల నిర్మూలన భద్రతా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలని కలలను సాకారం చేసుకోవాలి, తల్లిదండ్రులకు విద్యాసంస్థలకు మంచి పేరు తేవాలని అన్నారు. ఆకతాయిలు చెప్పే మాటలు, చేష్టలను నమ్మి ప్రేమాకర్షణలకు లోనై బంగారు భవిష్యత్తును కోల్పోకూడదు సూచించారు. సామాజిక భద్రతకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని కోరారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాల ద్వారా అధికంగా పౌరులు మరణిస్తున్నారని, అనారోగ్యంతోనో, దేశ రక్షణలోనో మరణించే వారి సంఖ్య కన్నా ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు అన్నారు. రోడ్డు ప్రమాదాలను నిర్మూలించడానికి రోడ్డు నియమాల పట్ల, రోడ్డు వినియోగం పట్ల అవగాహన ముందు జాగ్రత్తలే ప్రధాన ఆయుధాలని తెలిపారు. రోడ్డు వినియోగించే సమయంలో చుట్టూ ఉన్న ప్రమాదాలు, అడ్డంకులు గమనించి ముందుకు




సాగాలి. రోడ్డు ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని, కారులు పెద్ద వాహనాల్లో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ పెట్టుకోవడం సీట్ బెల్ట్ పెట్టుకోవడం వల్ల మరణాలను తగ్గించవచ్చని అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ మోసాలు పెనుముప్పులా మారాయని అపరిచితులకు వ్యక్తిగత సమాచారం పంచుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురై ఆర్థికంగా నష్టాల పాలవుతున్నారని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ఎవరైనా పరిచయమైతే వారికి వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకూడదని తెలిపారు. వ్యక్తిగత సమాచారం దొంగిలించి ఫోటోలు మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడతారని అన్నారు. కావున అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని వ్యక్తిగత ఫోటోలను బ్యాంకు ఖాతా వివరాలను పంచుకోవద్దని తెలిపారు. సోషల్ మీడియా వినియోగించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. యువత పౌరులు డ్రగ్స్ మత్తుకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆరోగ్యాలు కోల్పోతున్నారని అన్నారు. డ్రగ్స్ మత్తులో నేరాలు సైతం చేస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ ను మన సమాజం నుండి తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని దీనికి సంబంధించిన సమాచారం పోలీసువారికి అందియాలని విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత పిల్లల భద్రతలో పోలీస్ శాఖ అత్యంత అక్రమంగా ఉందని వేధింపులకు సంబంధించిన సమాచారాన్ని పోలీసు వారికి అందించాలని ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం నందు సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, సూర్యపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, స్థానిక ఎస్సై బాలు నాయక్ చందన, విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# సులువుగానే పోతాయి... కానీ!



**పనిచేస్తున్నప్పుడో, అనుకోకుండానో ఒక్కోసారి దుస్తులపై మరకలు పడుతుంటాయి. అవి మొండిగా మారకముందే సులువుగా వదిలించేయొచ్చు. అదెలాగంటే...**



**హెయిర్‌స్ప్రే:** దుస్తులమీద పెన్ను గీతలు పడుతుంటాయి. ఇంకూ చిమ్ముతుంది. ముఖ్యంగా లేత రంగు దుస్తుల్లో ఇవి మరీ కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. అలాంటప్పుడు వెంటనే అక్కడ కాస్త హెయిర్‌స్ప్రే చేసి టిష్యూతో అద్దండి. మరక పోయేవరకూ... ఇలా మూడు నాలుగు సార్లు చేస్తే సరిపోతుంది.

**నిమ్మరసం:** మరకల్ని వదిలించాలనే ఆలోచనతో వెంటనే వేణ్నీళ్లు ఉపయోగించి శుభ్రం చేయొద్దు. ఇవి వాటిని మరింత మొండిగా మారుస్తాయి. పసుపు రంగుని తొలగించడానికి నిమ్మరసం, ఉప్పుని చల్లి... అరగంట తర్వాత అక్కడ బ్రష్‌తో రుద్దాలి. ఆపై చల్లటి నీటితో ఉతకండి. ఒక్కసారిగా పోదు కానీ... మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తే ఫలితం ఉంటుంది. ఈ రెండింటినీ కలిపి దుస్తులపై తుప్పు మరకలు పడిన చోట రాసి ఉతికినా వదిలిపోతాయి.



# పాటతో మొదలైన నా ప్రయాణం..

## సక్సెస్ స్టోరీ మానసి పరేఖ్



సింగింగ్‌తో మొదలైన ఆమె కెరీర్.. యాక్టింగ్‌తో కొత్త మలుపు తీసుకుంది. ఇప్పుడు రెండింటిలోనూ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తోంది. లేటెస్ట్‌గా 'జమ్‌కుడి' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకొచ్చింది. ఈ సినిమా కోసం ఆమె టైటిల్ ట్రాక్ కూడా పాడింది. ఇంతకీ ఆమె ఎవరంటే... గుజరాతీ యాక్ట్రెస్ మానసి పరేఖ్. "ఇంతకుముందు కూడా నా సినిమాలకు నేను పాడా. 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో 'కంగ్రాచ్యులేషన్స్' అనే పాట. నేను నటించిన సినిమాలో పాట కూడా పాడడం చాలా హ్యాపీగా అనిపిస్తుంది" అంటోంది మానసి పరేఖ్. ఆమె సక్సెస్‌ఫుల్ జర్నీ గురించి మరిన్ని ముచ్చట్లు తెలుసుకుందాం.

నేను పుట్టింది గుజరాత్‌లో. పెరిగింది ముంబైలో. కాబట్టి రెండింటితో నాకు చాలా కనెక్షన్ ఉంటుంది. చిన్నప్పటి నుంచే మ్యూజిక్ అంటే ప్యాషన్. దాంతో అప్పుడే పాటలు పాడడంలో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టా. స్కూల్ ఈవెంట్స్, రియాలిటీ షోలు వంటి వాటిల్లో యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేశా. దాంతో మంచి పేరొచ్చింది. ఒకసారి ఒక షోకి సెలక్ట్ అయితే, అక్కడి నుంచి మరో అవకాశం దక్కేది. అలా వరుసగా ఎనిమిది టీవీ షోల్లో పార్టిసిపేట్ చేశా. వాటితోపాటు అడ్వర్టైజ్‌మెంట్స్‌లో కూడా కనిపించేదాన్ని. ఒకసారి ఫేమ్ వచ్చిందంటే.. వాళ్లు ఒక రంగంలోనే కాదు. వివిధ రంగాల్లో తమ టాలెంట్ ప్రూవ్ చేసుకునే అవకాశం కూడా వస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. హిందీ, గుజరాతీ సినిమాలు, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా నటనలోకి అడుగుపెట్టా. నాకు నటనలో నా స్కిల్స్ పెంచుకోవడానికి టీవీ షోలు ఉపయోగపడ్డాయి. అది కాకుండా నేను న్యూయార్క్‌లోని 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్'లో

### 20 ఏండ్ల అనుబంధం

టెలివిజన్ ఇండస్ట్రీతో నాకు 20 ఏండ్ల అనుబంధం ఉంది. అక్కడ ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నా. టీవీలో పనిచేసేవాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ పని పూర్తి చేయాల్సి ఉంటుంది. వాళ్ల ఎమోషన్స్ అన్నీ పక్కన పెట్టి నటించాలి. అదెలా ఉంటుందంటే.. మిలిటరీ ట్రైనింగ్లా ఉంటుంది అనిపించింది నాకు. ఎన్ని పనులున్నా, ఎలాంటి సమస్యలున్నా ప్రతి రోజూ షూటింగ్‌కి వెళ్లాల్సిందే. ఎలాంటి సిచ్యుయేషన్‌లో అయినా స్థిరంగా ఉండడం టెలివిజన్ నాకు నేర్పించింది. నాకున్న స్కిల్స్‌ను నేను రకరకాలుగా ఉపయోగించుకున్నా. టీవీలో నేను చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. నేను 'గులాల్' అనే పాపులర్ షో చేశాను. ఆ షో సెట్ మా ఇంటికి గంటన్నర జర్నీ దూరంలో ఉంటుంది. అంటే, నేను అక్కడికి వెళ్లిరావడానికి జర్నీకి మూడు గంటలు టైం పట్టేది. సెట్లో 14 గంటలు ఉండాల్సి వచ్చేది. మొత్తంగా ప్రతిరోజు నేను 17 గంటలు కష్టపడేదాన్ని. ఏడు గంటలు మాత్రమే నిద్రపోయేదాన్ని. అలా ఒక సంవత్సరం పాటు చేశాను. అయితే, ఆరునెలలు గడిచాక ఒత్తిడి వల్ల హెల్త్ పాడయ్యింది. డాక్టర్ దగ్గరకి వెళ్తే నా ప్రొఫెషన్ గురించి అడిగారు. ఎందుకంటే అప్పటికీ నా కళ్లచుట్టూ డార్క్ సర్కిల్స్ ఉన్నాయి. కాళ్లు వాచిపోయాయి. చెప్పాలంటే నా ప్రొఫెషన్‌కి నేను ఇలా ఉంటే పనిచేయలేను. అలాంటి సిచ్యుయేషన్‌ని దాటుకుని ఇక్కడి వరకు వచ్చా.

### కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా

వర్క్‌ని, పర్సనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం అనుకునేదాన్ని. ఇప్పుడు నా ప్రియారిటీలు ఏంటీ? అనేది నాకు తెలుసు కాబట్టి ఆ విధంగా మెయింటెయిన్ చేస్తున్నా. నా వర్క్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఇస్తానో, నా కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా. అమ్మ అంటే ఇంట్లో కూర్చుని పిల్లల్ని మాత్రమే చూసుకోవాల్సిన పనిలేదు. నేను సినిమాల్లోకి వచ్చి ఏడున్న ఏండ్లు అవుతుంది. నా కూతురు పుట్టాక, నేను ఏడు సినిమాల్లో నటించా. అంటే, ఏడాదికొక సినిమా చేశా అనుకోవచ్చు. అలా నేను వర్క్, ఫ్యామిలీ రెండింటినీ సమానంగా చూస్తా.

### 'జమ్‌కుడి'.. మర్చిపోలేని సక్సెస్

జమ్‌కుడి సినిమాలో నాది లీడ్ రోల్. అయితే మ్యూజిక్ డైరెక్టర్ ఒక పాట నువ్వు పాడాలని చెప్పారు. పాట అంటే నాకు ఎప్పుడూ ఇష్టమే కాబట్టి ఒప్పుకున్నా. సినిమాలో నటించడం, పాడడం వల్ల నేను క్యారెక్టర్‌కి బాగా కనెక్ట్ అయ్యా. పాటకు ఆడియెన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే చాలా హ్యాపీగా అనిపిస్తుంది. గ్లోబల్‌గా వైరల్ అవ్వడం మరింత ఉత్సాహాన్నిస్తోంది. ఇవన్నీ చేయగలుగుతున్నా కాబట్టి నా జర్నీ సంతృప్తికరంగా ఉంది. ఈ సినిమాని మా ఆయన పార్థివ్ గోహిల్ ప్రొడ్యూస్ చేశారు. తను నాలాగే యాక్టర్, సింగర్ కూడా. ఈ సినిమా కథ వినప్పుడే నా క్యారెక్టర్ డిసైడ్ చేశారు. ఆ సినిమా హిట్ అవుతుంది అనుకున్నాం. కానీ గుజరాతీ సినిమాల్లో ఈ ఏడాది బెస్ట్‌గా నిలుస్తుంది అనుకోలేదు. పది రోజుల్లో 8.5 కోట్లు కలెక్ట్ చేసింది. గుజరాతీ సినిమా గొప్పదనం ఏంటో నిరూపించింది అని గర్వంగా చెప్తా.

బ్యూటీ

# ముఖ సౌందర్యం కోసం..





### కీరా – అలోవెరాతో..

ఒక టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌లో పావు టీస్పూన్ కీరదోస తురుము వేసి బాగా కలపాలి. ఆ ప్యాక్‌ని ముఖం, మెడ భాగాలకు పూసుకోవాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే కాంతివంతంగా ఉంటుంది.



### పాలు–తేనెలతో..

ఒక టీస్పూన్ తేనెలో రెండు టీస్పూన్లు పచ్చి పాలు కలపాలి. ఆ రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు లేదా మూడు నిమిషాలు మర్దన చేయాలి. ఆ తర్వాత గోరు వెచ్చని నీళ్లతో ముఖాన్ని కడగాలి. పాలు, తేనెల ఫేస్‌వాష్ వాడితే స్కిన్ కాంతివంతంగా మారుతుంది. జిడ్డు తొలగిపోతుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్న వాళ్లకు ఇది చాలా బాగా పనిచేస్తుంది.

# గుఱ్ఱపు డెక్క ఆకును తొలగిస్తాం.. దోమల నివారణ చేపడతాం..

* **కాలనీవాసులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భరోసా..**

ఎల్బీనగర్, మార్చి 13 (భారత శక్తి): చెరువుల్లో గుఱ్ఱపు డెక్క ఆకు పెరిగి, దోమల భాద తట్టుకోలేక, కాలనీవాసుల భాదలు చూడలేక ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు, హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరికుంట చెరువుల్లో పేరుకుపోయిన గుఱ్ఱపు డెక్క ఆకును శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న వాకర్స్ మాట్లాడుతూ, ఇక్కడికి వాకింగ్ రావాలంటే దోమల వల్ల మాకు ఎక్కడ విష రోగాలు వస్తాయో అని భయపడుతున్నామని, దోమల ప్రభావం వల్ల చాలా మంది ఉదయం, సాయంత్రం పూట వాకింగ్ రావడానికి జంకుతున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత భారాస ప్రభుత్వంలో ప్రజా సమస్యల మీద ఎంతో చిత్తశుద్ధితో ముందుచూపుతో ఆలోచించి నియోజకవర్గ పరిధిలోని చెరువుల్లో గుఱ్ఱపు డెక్క ఆకు పేరుకొనిపోకుండా కాలనీవాసుల సౌలభ్యం కోసం దోమల నివారణకు డ్రోన్స్ సహాయంతో ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించి దోమల నివారణ గావించాం. అలాగే చెరువుల్లో దోమల వల్ల ఉత్పన్నం అయ్యే లార్వాను అరికట్టడానికి వేలాది గంబూజియా జాతికి చెందిన చేప పిల్లలను చెరువులోకి వదలడం వల్ల అవి లార్వాను మింగేయడం జరిగింది.తద్వారా దోమల వ్యాప్తి అరికట్టడం జరిగింది.అలాగే డ్రోన్ పరికరాన్ని ఉపయోగించి చెరువు మధ్యలోకి వెళ్లడం సాధ్యం కాని చోట్ల కూడా దోమల నివారణకు మందులు చల్లడం జరిగిందని గుర్తు చేశారు.కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాల మీద దృష్టి పెట్టకుండా చెరువుల్లో పెరుకుపోతున్న



గుఱ్ఱపు డెక్క ఆకును తొలగించకుండా నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తుంది. ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నా ఉలుకు, పలుకు లేదని అన్నారు.ప్రస్తుతం ఉదయం, సాయంత్రం పూట వాకింగ్ కోసం రావాలంటే దోమల దండయాత్ర వల్ల ఎక్కడ మలేరియా,డెంగీ జ్వరాలు వస్తాయో అని ప్రజలు భయపడుతున్నారని అన్నారు.కొందరు కాంగ్రెసు నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తూ తమ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్ సిటీ అని గొప్పలు చెప్పుకుంటూ ప్రస్తుతం ఉన్న సిటీని కాపాడుకోలేక తంటాలు పడుతుందని, జంటనగరాల అభివృద్ధి గాలికి వదిలారని అన్నారు. సాయంత్రం పూట వాకింగ్ పోతే పక్కవారితో మాట్లాడితే వారి నోట్లోకి దోమలు దూరుతున్నాయని అన్నారు. ఇప్పటికయినా ప్రభుత్వం ప్రజా ఆరోగ్య సమస్యల మీద దృష్టి సారించాలని కోరారు.అలాగే ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో చెరువుల్లో పేరుకుపోయిన గుఱ్ఱపు డెక్క ఆకును రెండు,మూడు రోజుల్లో తొలగించి అనంతరం చుట్టుపక్కల కాలనీల దోమల స్ప్రే చేయించడం జరుగుతుందని కాలనీ వాసులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, భారాస నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



## చిలుక ఉపేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన
# కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ఎల్బీనగర్, మార్చి 13 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేశ్వరం నియోజకవర్గం పేదల పెన్నిధి, కాలనీ వాసులకు ప్రతీ క్షణం అందుబాటులో ఉండి వారి సమస్యలను తీర్చే యువ నాయకుడు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఆర్కేపురం డివిజన్ వాసవీ కాలనీలో ఘనంగా జరిపారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రావు, రమేష్ నేత, లింగస్వామి గౌడ్, మహేందర్, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, రామారావు, వెంకట్ రెడ్డి, సైదులు,పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మొల్లమాంబ సాహిత్యం తెలుగు భాషా అభివృద్ధి కి మరియు
# సామాజిక చైతన్యానికి ఎంతో తోడ్పడింది

**: జిల్లా రెవెన్యూ అధికారి**



వైఎస్సార్ కడప,మార్చి 13(భారత శక్తి): మొల్లమాంబ సాహిత్యం తెలుగు భాషా అభివృద్ధి కి మరియు సామాజిక చైతన్యానికి ఎంతో తోడ్పడిందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర్ నాయుడు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కడప కలెక్టర్ కార్యాలయం లోని పి జి ఆర్ ఎస్ సమావేశపు హాల్ నందు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ గారి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ కడప జిల్లా గోపవరం గ్రామంలో కుమ్మరి కుటుంబంలో జన్మించిన ఆతుకూరి మొల్ల 16వ శతాబ్దానికి చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రి అని తెలిపారు.ఆమె రచనా శైలి సరళమైనది, రమణీయమైనది గా ఉండటంతో ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా ఉండదన్నారు.ఎందరో కవులు శ్రీరాముని చరిత్రను వివిధ విధాలుగా రచించినప్పటికీ,సామాన్య ప్రజలకు అర్థమయ్యే సరళమైన తెలుగు వాడుక భాషలో "మొల్ల రామాయణం"ను రచించడం ఆమె ప్రత్యేకత అని తెలిపారు.మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో విశిష్టస్థానం సంపాదించిందన్నారు. కవయిత్రి మొల్ల తెలుగు సాహిత్యానికి చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె జీవిత విశేషాలు మరియు సాహిత్య కృషి గురించి సంక్షిప్తంగా వివరించడంతో పాటు, సమాజానికి ఆమె అందించిన ప్రేరణాత్మక సందేశాలను ప్రస్తావించారు. మొల్లమాంబ గారి సాహిత్యం తెలుగు భాషా అభివృద్ధికి మరియు సామాజిక చైతన్యానికి ఎంతో తోడ్పడిందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది,కుల సంఘాల నాయకులు మరియు కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే జాతీయ లోక్ అదాలత్

* **జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు**
* **"14-03-2026 (శనివారము) వ తేదిన "జాతీయ లోక్ అదాలత్ ను" వినియోగించుకోండి సత్వర న్యాయం పొందండి:**



కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 13: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ , అమరావతి వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో 14032026 వ తేదీన ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు "జాతీయ లోక్ అదాలత్" నిర్వహించబడుతుంది. జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినది. కడప నందు 5, ప్రొద్దుటూరు నందు 3, రాజంపేట నందు 2, రాయచోటి నందు 3, బద్వేల్ నందు 2, సిద్ధవటం, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, నందలూరు మరియు రైల్వే కోడూరు నందు ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేయడం జరిగినది. మరింత సమాచారం కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్: 08562 258622, 244622 ఈమెయిల్ అడ్రస్: kadapa.dcourts.gov.in dlsakdp@gmail.com. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చును. న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు "జాతీయ లోక్ అదాలత్ ను" జయప్రదం చేయవలసిందిగా డాక్టర్ సి.యామిని, చైర్మన్‌కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప మరియు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ కంసీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఒక ప్రకటనలో తెలియజేశారు.


## బీడీ పరిశ్రమలో పనిచేయు బీడీ టేకేదార్ కు కమిషన్ రేటుతో పాటు
# ఇతర సమస్యలు పరిష్కారం చేయాలి

* **బీడీ యాజమాన్యం సంఘంకు బిఎల్ టీయూ, డిమాండ్ నోటీసు**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: శుక్రవారం తెలంగాణ బహుళ జన బీడీ టేకేదార్ యూనియన్, బిఎల్ టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాదు జిల్లా కేంద్రం లో బీడీ యాజమాన్యం సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, తమ్ముడు, శ్రీ, ప్రకాష్ కు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రీ, ధర్మేంద్ర గాంధీ కి, డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగింది, అనంతరం తెలంగాణ బహుళ జన బీడీ టేకేదార్ యూనియన్, బిఎల్ టీయూ, రాష్ట్ర అధ్యక్షులు, బిఎల్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యస్, సిద్దిరాములు, రాష్ట్ర అధ్యక్షులు, మంత్రి సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీ. తిరుపతి గౌడ్, మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు తట్టుకోవడం కోసం బీడీ పరిశ్రమలో పనిచేయు బీడీ టేకేదార్లకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి బీడీ యాజమాన్యం టేకేదార్లకు కమిషన్ రేటు పెంచవల్సిఉంది, కిందటి 2024, సంవత్సరం ఒప్పందం తేదీ31.03.2026, నాటికి ముగుస్తుంది. అందుకని నూతన కమిషన్ రేటు ఒప్పందం, బీడీ కార్మికులకు వెయ్యి బీడిలకు ఇస్తున్న వేతనంలో, 20% పెంచి ఇవ్వాలని, బీడీ కార్మికులకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో కరువు భత్యం, విడిఎ, పెరిగినట్లు, టేకేదార్లకు కమిషన్ రేటు పెంచి ఇవ్వాలని, బీడీ టేకేదార్లకు, పి,యఫ్,ఇ,యస్,ఐ, సౌకర్యం కల్పించాలని, నెల రోజులకు సరిపోయే ఆకు ఇవ్వాలని, అకు మర్జిన్ 100, గ్రాములకు పెంచాలని, లేబర్ లైసన్ ఖర్చులు బీడీ యాజమాన్యం భరించాలని, డిపాజిట్ బ్యాంకులో టేకేదార్ పై ఫిక్స్ చేయాలని, గతంలో మా యూనియన్ లో చేసుకున్న ఒప్పందం ప్రకారం కొన్ని బీడీ యాజమాన్యం వారు 3,రూ,ల,నుండి,12,రూ,ల వరకు తక్కువ ఇస్తున్నారు. బకాయిలతో సహా ఇప్పించాలని, తదితర డిమాండ్లతో కూడిన నోటీసు ఇవ్వడం జరిగింది. త్వరలోనే బీడీ సేట్లతో మాట్లాడి, చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేస్తామని, బీడీ యాజమాన్యం అధ్యక్షులు, శ్రీ, ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రీ ధర్మేంద్ర గాంధీ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ టేకేదార్ యూనియన్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, బిఎల్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యస్, సిద్దిరాములు, తెలంగాణ బహుళ జన బీడీ టేకేదార్ యూనియన్, రాష్ట్ర అధ్యక్షులు, మంత్రి సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీ,తిరుపతి గౌడ్, నిజామాబాదు జిల్లా టేకేదార్ యూనియన్ నాయకులు, మారుతి, ప్రభాకర్, రమేష్, లక్ష్మన్, చిన్న గాంగాదర్, రమేష్ గౌడ్, సత్యం, సతిష్, ఆత్మరాములు, ప్రవీణ్,సాయి, కామారెడ్డి, అధ్యక్షులు, యం. బాస్కర్, జిల్లానాయకులు, యస్, రాంచంద్రం, రాజాశేఖర్, నరేందర్, బాల్ రాజు, శ్రీ నివాస్, సిద్దిపేట జిల్లా నాయకులు, రాజు, పరమేశ్వర్, సిరిసిల్ల జిల్లా నాయకులు, రమేష్, జగిత్యాల జిల్లా నాయకులు, నారాయణ, నిర్మల్ జిల్లా నాయకులు, రాజేశ్వర్, దినేష్, పరమేశ్వర్ బిఎల్ టీయూ జిల్లా నాయకులు, జగదీష్, సయ్యద్, వేణు తదితరులతో పాటు, నిజామాబాదు, కామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, నిర్మల్, జగిత్యాల తదితర జిల్లాల బీడీ టేకేదార్లు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత



హైదరాబాద్, (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఇవాళ ఉదయం డయాలసిస్ చేయించుకునేందుకు నిమ్స్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లిన తర్వాత ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో పడిపోయినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు మళ్లీ ఆయన్ను నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లాలో 1943లో హెచ్‌జే దొర జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎకనమిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన.. 1965లో ఐపీఎస్‌లో చేరారు. తన 40 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టేందుకు, సమర్థవంతమైన పోలీసింగ్ ద్వారా హింసను తగ్గించేందుకు విశేష కృషి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గానూ 'పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ' అవార్డు లభించింది. ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన హైదరాబాద్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా తన ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆ తర్వాత కృష్ణా జిల్లా ఎస్పీగా పని చేశారు. సీబీఐలో ఎస్పీగా పని చేసిన సమయంలో అంతర్రాష్ట్ర, ఆర్థిక నేరాలను ఛేదించడంలో నైపుణ్యం సంపాదించారు. స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గానూ, సీఐడీ హెడ్‌గానూ సేవలందించారు. 1996 నవంబర్‌లో ఏపీ డీజీపీగా నియమితులై.. ఫిబ్రవరి 2002 వరకు ఐదేళ్లకుపైగా ఆ పదవిలో కొనసాగారు. డీజీపీగా పదవీ విరమణ చేసిన తర్వాత, సెప్టెంబర్ 11, 2002న సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌లో విజిలెన్స్ కమిషనర్‌గా నియమితులయ్యారు. దీనికి ముందు ఆయన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గానూ సేవలందించారు.

# కార్మికుల సంక్షేమం ఎక్కడ..?

* **కలెక్టర్ కార్యాలయం ముందు-సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా**



సూర్యాపేట(భారత్ శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 13: సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భవన నిర్మాణ కార్మికులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ ఎం సుదర్శన్ రెడ్డి కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్ మాట్లాడుతూ, వెల్ఫేర్ బోర్డులో కోట్ల రూపాయల నిధులు ఉన్నప్పటికీ కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.కార్మికులకు ఉపయోగపడని సిఎస్సి హెల్త్ టెస్టులు నిర్వహిస్తూ వేల కోట్ల రూపాయలు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపిస్తూ, సిఎస్సి హెల్త్ టెస్టులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేసి, నేరుగా వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.జీవో నెంబర్ 12ను సవరించి కాన్పు మరియు పెళ్లి కానుకకు ప్రస్తుతం ఇస్తున్న 30 వేల రూపాయలను లక్షకు పెంచాలని, సహజ మరణానికి ఇస్తున్న 2 లక్షలను 5 లక్షల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్మిక శాఖ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఏసీఎల్, ఏఎల్ఓ, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. భర్త మరణంతో దరఖాస్తు చేసుకున్న మహిళలు ఆవేదన ఆవేదన చెందుతున్న పరిష్కరించటంలో ఉద్యోగులు విఫలమవుతున్నారని, వెల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని, 60 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.5 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. బైక్ ప్రమాదంలో మరణించిన కార్మికుడికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలనే నిబంధనను తొలగించాలని కూడా డిమాండ్ చేశారు.అదేవిధంగా వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని వెంటనే నియమించాలని, శేష నిధులను కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని, 2009 నుంచి రీన్యువల్ కోల్పోయిన కార్మికులకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వెంటనే రీన్యువల్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ‘సిద్ధంగా ఉండండి’ - 6 నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగొచ్చు

అమరావతి, (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: స్థానిక సంస్థల ఎన్నికలు 6 నెలల్లో జరగొచ్చు, అందుకు సిద్ధంగా ఉండాలని మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. వైఎస్సార్సీపీ చేసిన విధ్వంసాన్ని చెప్తూనే కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికలల్లో మనం గెలిచామన్న చంద్రబాబు, ఎన్నిక ఏదైనా కూటమిదే గెలుపు కావాలని స్పష్టం చేశారు. పంచాయతీలు మాదిరిగానే నీటి సంఘాలు నీటి పన్ను వసూలు చేయాలని మంత్రి రామానాయుడుకు చెప్పారు. చేసిన పనిని మీరు మీడియాకు చెప్పుకోవడంలో విఫలమవుతున్నారని మంత్రులతో వ్యాఖ్యానించారు. మంత్రివర్గంలో అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై సీఎం మంత్రులతో చర్చించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల గ్యాస్ కొరత తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కొందరు గ్యాస్‌కి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ పొయ్యిలు వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఎలక్ట్రిక్ పొయ్యిలు ఎక్కువ వాడితే విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్ పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. 90 రోజుల పాటు జలాధార కార్యక్రమం : ఏప్రిల్ 2న శాఖల పనితీరు మీద నివేదికలు ఇస్తానని ముఖ్యమంత్రి వెల్లడించారు. నివేదికలు ఆధారంగా సమీక్ష చేసుకుని పురోగతి సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 2 నుంచి 90 రోజుల పాటు జలాధార కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కాలవులు, డ్రైన్లు శుభ్రం చేయించి భూగర్భ జలం పెంచటమే లక్ష్యంగా జలాధార చేపట్టాలన్నారు. మే 15 కల్లా సాగునీటిని విడుదల చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు : వైఎస్సార్సీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దాదాపు 7 లక్షల ఎకరాలకు నీరందలేదన్న సీఎం, చివరి ఎకరాకు నీరిచ్చే దిశగా జలాధార జరగాలని సూచించారు. వరదల వల్ల రేపల్లె వద్ద బలహీనంగా ఉన్న కరకట్టను అభివృద్ధి చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. ఈ నెల 16న అమరావతిలో పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణ చేపడుతున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ పొట్టిశ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆరుగురు మంత్రులు గైర్హాజరు : వివిధ కారణాల వలన ఆరుగురు మంత్రులు మంత్రివర్గ సమావేశానికి రాలేకపోతున్నామని ముందస్తు సమాచారం ఇచ్చారు. తీవ్ర అనారోగ్యం వలన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనిత, టీజీ భరత్ గైర్హాజరు కాగా భార్య సంవత్సరికం వల్ల ఫరుఖ్ కేబినేట్‌కు రాలేకపోయారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ వలన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ కెబినేట్‌కు రాలేదు.

## మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు గాంధీ సరోవర్ ప్రణాళికలపై ప్రజెంటేషన్

హైదరాబాద్, (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా ఈసీ, మూసీ నదుల సంగమ స్థలిలో ప్రపంచస్థాయి కేంద్రంగా గాంధీ సరోవర్ పార్క్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు ప్రణాళికలపై తాజ్ కృష్ణ హోటల్‌లో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మూసీ ఇన్వైట్స్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. మూసీ పునరుజ్జీవం ఆవశ్యకతపై ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నరసింహారెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు.

## అమరావతిలో బిట్స్ పిలానీ ‘ఏఐ ప్లస్ క్యాంపస్’
## నిర్మాణ ప్లాన్లు పరిశీలించిన మంత్రి లోకేశ్

అమరావతి, (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: ఏపీ రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BITS) పిలాని ‘ఏఐ ప్లస్ క్యాంపస్’ నిర్మాణ ప్లాన్లను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పరిశీలించారు. ఉండవల్లిలోని నివాసంలో బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్.చెన్నవీర్, బీఎస్ సహాని మంత్రి నారా లోకేశ్ ను కలిసి క్యాంపస్ నిర్మాణ ప్రణాళికలను వివరించారు. నిర్మాణ ప్లాన్లను, డిజైన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బిట్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు విద్యనందించేలా ఈ క్యాంపస్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో దీనిపై రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే తొలి ఏఐ క్యాంపస్‌గా దీనిని తీర్చిదిద్దుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా అత్యాధునిక టెక్నాలజీతో దీనిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, రోబోటిక్స్ వంటి కోర్సులతో పాటు వ్యవసాయం, వాతావరణం, ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కోర్సులను కూడా ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. పర్యావరణహితంగా గ్రీన్ బిల్డింగ్, పునరుత్పాదక ఇంధన విధానాలతో నిర్మాణం చేపడుతున్నామని, పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్లాన్లను పరిశీలించిన మంత్రి లోకేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపస్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని వారికి సూచించారు.

## ఎల్‌పీజీ కొరత!
## శిర్డీలో ’సోలార్ కుకింగ్ సిస్టమ్’తో వంటలు

శిరిడీ, (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్ కొరతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో కొన్నేళ్ల క్రితం శిర్డీలోని సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన ‘సోలార్ కుకింగ్ సిస్టమ్’ రోల్ మోడల్‌గా నిలుస్తోంది. వంటగాస్ సంక్షోభం సమయంలో శిర్డీలోని ‘సోలార్ కుకింగ్ సిస్టమ్’ గురించి చర్చ జరుగుతోంది.

**కేంద్ర నుంచి ప్రశంసలు**

శిర్డీలో ‘సోలార్ కుకింగ్ సిస్టమ్తో’ ప్రతిరోజూ వేలాది మంది భక్తులకు ఆహారం వండుతున్నారు. దీంతో శిర్డీ సాయిబాబా సంస్థాన్‌కు (ట్రస్టుకు) కోట్లాది రూపాయల ఇంధనం ఖర్చు ఆదా అవుతోంది. శిర్డీ సాయిబాబా సంస్థాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ వినూత్న ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. దేశంలోనే ఒక విశిష్ట నమూనాగా ఈ ప్రాజెక్టును ప్రత్యేకంగా ప్రశంసించింది.

* **రోజుకు 40,000 మందికి భోజనం తయారీ**

ప్రతిరోజూ దేశం నలుమూలల నుంచి 75,00080000 మంది భక్తులు సాయిబాబా దర్శనం కోసం శిర్డీకి వస్తుంటారు. ఇలా వచ్చే భక్తులందరికీ సాయిబాబా సంస్థాన్ ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రసాదాలయం (సామూహిక భోజనశాల)లో పోలి (రొట్టె), వెజిటబుల్ కర్రీ (కూర), పప్పుఅన్నం, ఒక స్వీట్‌ను వడ్డిస్తుంది. దాదాపు రోజుకు దాదాపు 40,000 మంది ప్రసాదాలయంలో ఉచిత భోజనం చేస్తారు.

## గ్యాస్ బుకింగ్‌లో తీవ్ర అవస్థలు
## సిలిండర్ డెలివరీకి వారంపైగా గడువు!

ఢిల్లీ, (భారత శక్తి ప్రతినిధి) మార్చి 13: పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం వల్ల గ్యాస్ కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇంటి అవసరాల కోసం గ్యాస్ వినియోగదారులకూ ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తవని సర్కార్ ప్రకటిస్తూనే ఉంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. పలు ప్రాంతాల్లో సిలిండర్ బుకింగ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ మార్గాలు కొన్ని పని చేయడం లేదు. దీంతో వినియోగదారులు నేరుగా ఏజెన్సీల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఒక్కసారిగా రద్దీ పెరగడం, బుకింగ్ సిస్టమ్ నెమ్మదించడం వల్ల సమస్య ఏర్పడిందని ఏజెన్సీల నిర్వాహకులు తెలుపుతున్నారు. పరిస్థితి చేయి దాటితే బ్లాక్‌లో తీసుకునే ప్రయత్నం : డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ సాధారణ రోజుల్లో బుక్ చేస్తే ఒకటి, రెండు రోజుల్లో సిలిండర్ వస్తుంది. కానీ ఇప్పుడు వారంపైగా పడుతోందని వినియోగదారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో భారత్, ఇండేన్ , హెచ్‌పీ మూడు ఏజెన్సీలు గ్యాస్ సరఫరా చేస్తున్నాయి. 350 నుంచి 400 మంది డీలర్లు ఉండగా, అందులో 30 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయి. సింగిల్ సిలిండర్ మాత్రమే ఉండి, అది అయిపోయిన వారంతా బుక్ చేసుకునేందుకు ఏజెన్సీల వద్ద లైన్లు కడుతున్నారు. నేరుగా ఫోన్ లో సంప్రదించేందుకు ప్రయత్నిస్తే స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. వాణిజ్య కేటగిరి సరఫరా ఆగిపోవడంతో డొమెస్టిక్ సిలిండర్లను టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, హాస్టళ్ల నిర్వాహకులు బ్లాక్ లో తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎల్‌పీజీ కొరత లేదు : రంగారెడ్డి జిల్లాలో ఎల్‌పీజీకి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో ఎల్‌పీజీ డీలర్లతో సమావేశం నిర్వహించారు. సిలిండర్ పంపిణీకి ఎటువంటి అంతరాయాలు లేకుండా యథావిధిగా కొనసాగడానికి తగిన చర్యలు తీసుకోవాలని డీలర్లను ఆదేశించారు. వినియోగదారులు అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లు నిల్వ చేసుకోవద్దని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి వనజాతరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## త్వరలోనే ఇరాన్
## లొంగిపోతుంది : ట్రంప్

దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం జీ7 నేతల వర్చువల్ భేటీలో ట్రంప్ పేర్కొన్నట్లు ఓ వార్త సంస్థ తెలిపింది. అమెరికా ఇజ్రాయెల్ దాడులకు ప్రతికారం తీర్చుకుంటామని, వారికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగించాలని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ వ్యాఖ్యలకు ముందు ట్రంప్ చేపినట్లు తెలిపింది.

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై దాడి
## గుర్తుపట్టలేని విధంగా మారిన ముజ్తబా

ఇరాన్, మార్చి 13:ఇరాన్ నూతన సుప్రీం లీడర్ అయతుల్లా ముజ్తబా ఖమేనీపై అమెరికా రక్షణ శాఖ కీలక ప్రకటన చేసింది. తమ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించింది. దీంతో ముజ్తబా ఖమేనీ గుర్తుపట్టలేని విధంగా మారారని తెలిపింది. అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ముజ్తబా ఖమేనీ గురువారం తొలిసారి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనపై దాడి చేశామంటూ అమెరికా రక్షణ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

* **ఇరాన్ కళ్లు కప్పి, తికమక పెట్టి, బోల్తా కొట్టించి దాడులు**

ఇరాన్‌పై శుక్రవారం కూడా పెద్దసంఖ్యలో వైమానిక దాడులు చేశామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. ఈ ప్రపంచం కనీవినీ ఎరుగని రీతిలో ఇరాన్ సైన్యాన్ని అణచివేస్తున్నామని ఆయన తెలిపారు. ఇరాన్‌పై దాడుల సంఖ్యతో పాటు వాటి కచ్చితత్వాన్నీ పెంచామన్నారు. ఏఐ టెక్నాలజీ, సైబర్ టూల్స్, అంతరిక్ష టెక్నాలజీ వంటి వాటితో ఇరాన్ కళ్లు కప్పి, తికమక పెట్టి, బోల్తా కొట్టించి దాడులు చేస్తున్నామని ఆయన చెప్పారు.
ఇరాన్ చెప్పుకున్న ఆధునిక సైన్యం, తమ దాడుల్లో చాలా వేగంగా డీలా పడిందన్నారు. ఇక ఈ యుద్ధంలో గెలిచేదాకా ఆగేది లేదని పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. ఈ యుద్ధపు పగ్గాలన్నీ అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చేతుల్లోనే ఉన్నాయని, దీని వేగం, తీరు, దిశ, టైమింగ్‌ను ఆయనే డిసైడ్ చేస్తారని తేల్చి చెప్పారు.

* **ఇప్పటిదాకా ఇరాన్‌లోని 15వేలకుపైగా లక్ష్యాలపై ఎటాక్స్**

ఇరాన్ అనేది అమెరికాకు సరిసమాన సైనిక శక్తి కానే కాదని పది రోజుల క్రితం చేసిన ప్రకటననే పీట్ హెగ్సెత్ పునరుద్ఘాటించారు. ప్రపంచంలోనే శక్తివంతమైన అమెరికా, ఇజ్రాయెల్ వాయుసేనలు కలిసి ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు ఇరాన్‌లోని 15వేలకుపైగా లక్ష్యాలపై దాడులు చేశాయన్నారు. ఈ లెక్కన సగటున రోజుకు 1 వెయ్యికిపైగా లక్ష్యాలపై ఎటాక్స్ చేశామని, గతంలో ఇతర దేశాలేవీ ఇంత తక్కువ టైంలో ఇన్ని లక్ష్యాలపై దాడులు చేయలేకపోయాయన్నారు. ఇరాన్ చెప్పుకున్న ఆధునిక సైన్యం, తమ దాడుల్లో చాలా వేగంగా డీలా పడిందన్నారు. ఇక ఈ యుద్ధంలో గెలిచేదాకా ఆగేది లేదని పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. ఈ యుద్ధపు పగ్గాలన్నీ అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చేతుల్లోనే ఉన్నాయని, దీని వేగం, తీరు, దిశ, టైమింగ్‌ను ఆయనే డిసైడ్ చేస్తారని తేల్చి చెప్పారు.

* **ఇప్పటిదాకా ఇరాన్‌లోని 15వేలకుపైగా లక్ష్యాలపై ఎటాక్స్**

ఇరాన్ అనేది అమెరికాకు సరిసమాన సైనిక శక్తి కానే కాదని పది రోజుల క్రితం చేసిన ప్రకటననే పీట్ హెగ్సెత్ పునరుద్ఘాటించారు. ప్రపంచంలోనే శక్తివంతమైన అమెరికా, ఇజ్రాయెల్ వాయుసేనలు కలిసి ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు ఇరాన్‌లోని 15వేలకుపైగా లక్ష్యాలపై దాడులు చేశాయన్నారు. ఈ లెక్కన సగటున రోజుకు 1 వెయ్యికిపైగా లక్ష్యాలపై ఎటాక్స్ చేశామని, గతంలో ఇతర దేశాలేవీ ఇంత తక్కువ టైంలో ఇన్ని లక్ష్యాలపై దాడులు చేయలేకపోయాయన్నారు. ప్రస్తుతం ఇరాన్ గగనతలంలో అమెరికా యుద్ధ విమానాలు, బాంబర్ విమానాలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయని ఆయన చెప్పారు. తమ యుద్ధ విమానాలు చాలా తీరికగా ఇరాన్‌లోని లక్ష్యాలను గుర్తించి దాడులు చేయగలుగుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్ నుంచి తమకు అందుతున్న నిఘా సమాచారంలోనూ చాలా స్పష్టత ఉందని పీట్ హెగ్సెత్ తెలిపారు. హార్మూజ్ జలసంధిపై ఇరాన్ దాదాగిరీని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆ సముద్ర జలమార్గం మీదుగా వాణిజ్య నౌకల రాకపోకలకు, ఇంధన సరఫరాలకు అంతరాయాన్ని తొలగించడంపై ప్రస్తుతం కసరత్తు చేస్తున్నామన్నారు.

## భారత్ మా మిత్రదేశం..
## అందుకే సురక్షిత మార్గం కల్పిస్తున్నాం

మార్చి 13:పశ్చిమాసియాలో యుద్ధం భీకరంగా కొనసాగుతోంది. ఇరాన్‌లోని భద్రత చెక్‌పాయింట్లపై, లెబనాన్‌లోని పర్యాటక ప్రాంతంపై అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేశాయి. ఈ దాడుల్లో 21 మంది మరణించగా 32 మంది గాయపడ్డారు. మరోవైపు తమ దేశంలోని జనావాసాలే లక్ష్యంగా ఇరాన్ దాడులకు పాల్పడుతోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఇది ఘోరమైన యుద్ధ నేరమని పేర్కొంది. అటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా చేస్తున్న దాడులపై ఇజ్రాయెల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. హెజ్‌బొల్లా మిలిటెంట్ సంస్థ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది.

## వారి జోలికి వెళితే మళ్లీ అధికారంలోకి రాలేమని మాకు తెలుసు: రేవంత్ రెడ్డి

మార్చి 13:పేదల జోలికి వెళితే మాకు మళ్లీ అధికారం వస్తుందా, అలాంటప్పుడు మేం పేదలకు అన్యాయం ఎందుకు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పేదలకు మేం మంచి చేస్తే, తాము అధికారంలోకి రాలేమని ప్రతిపక్ష నాయకులకు భయం పట్టుకుందని విమర్శించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘మూసీ ఇన్వైట్స్’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూసీ అభివృద్ధిని బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. రెండేళ్లుగా అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించాకే ముందడుగు వేస్తున్నామని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు ఇప్పటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ వంటి ప్రాజెక్టులకు కొంతమంది అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూసీ, ఈసా సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూఘాట్‌ను పర్యాటక కేంద్రంగా చేస్తామని అన్నారు. మూసీ, గోదావరి జలాలతో ప్రజల దాహార్తిని తీర్చే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఘనమైన చరిత్ర కలిగిన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతే ఎలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులు ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాజెక్టులను అడ్డుకోవద్దని కోరారు.

## వంట గ్యాస్‌పై ఆందోళన... కేంద్రమంత్రికి కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 13:పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, ఎల్పీజీ సిలిండర్ల కొరతపై వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి లేఖ రాశారు. గృహ అవసరాల కోసం ఎల్పీజీ సిలిండర్ల కొరతను సమన్వయంతో పునరుద్ధరించాలని కోరారు. గ్యాస్ కొరత కారణంగా హోటళ్లు, హాస్టళ్లు ఎదురొంటున్న సంక్షోభ నివారణకు తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్యాస్ సరఫరాను పునరుద్ధరించకపోతే హైదరాబాద్ సహా తెలంగాణవ్యాప్తంగా దాదాపు 90 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు 48 గంటల్లో మూతపడే ప్రమాదం ఉందని రాష్ట్రంలోని హోటల్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గ్యాస్ కొరత కారణంగా హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పీజీ హాస్టళ్లలో నివసించే లక్షలాది మంది విద్యార్థులు, వరింగ్ ప్రొఫెషనల్స్‌కు భోజనానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్యాస్ కేటాయింపుల్లో పెద్ద పెద్ద సంస్థల కంటే చిన్న చిన్న వ్యాపారులు, సంస్థలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

# బడంగ్‌పేట్‌లో 'మంట' పుట్టిస్తున్న మల్టీస్టోరీ బిల్డింగులు!




* **అగ్ని భద్రత గాలికి.. అధికారుల నామమాత్రపు తనిఖీలు?**
* **99 రోజుల ప్లాన్‌లో భాగంగా సర్కిల్-16లో నోటీసుల జారీ**

బడంగ్‌పేట్, మార్చి 13(భారతశక్తి): నిబంధనలు తుంగలో తొక్కి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు అగ్నిగుండాలుగా మారుతున్నాయి. అగ్ని భద్రత (ఫైర్ సేఫ్టీ) ఊసే లేని కట్టడాలు అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శుక్రవారం బడంగ్‌పేట్ సర్కిల్ 16 పరిధిలో అధికారులు మెరుపు తనిఖీలు నిర్వహించారు. జోనల్ కమీషనర్ కె. చంద్రకళ ఆదేశాలతో డిప్యూటీ కమీషనర్ పి. సరస్వతి రంగంలోకి దిగి పలు భవనాలను పరిశీలించారు.

**సేఫ్టీ నిల్.. నోటీసులు ఫుల్!**

తనిఖీల్లో భాగంగా అగ్ని భద్రత చర్యలు తీసుకోని బహుళ అంతస్తుల భవనాలను అధికారులు గుర్తించారు. కనీసం ఫైర్ ఎస్టింగిషర్లు, అత్యవసర ద్వారాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్ని భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, వెంటనే చర్యలు తీసుకోకుంటే కఠిన నిర్ణయాలు ఉంటాయని డిప్యూటీ కమీషనర్ హెచ్చరించారు.

**అప్పుడే ఎందుకు గుర్తొచ్చింది?**

అయితే, అధికారులు కేవలం స్పెషల్ డ్రైవ్‌లు ఉన్నప్పుడే ఇలాంటి తనిఖీలు చేయడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. బిల్డింగులు కడుతున్నప్పుడే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కేవలం నోటీసులకే పరిమితం కాకుండా, ప్రమాదకరమైన భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ ఎం. దినేష్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




# చెరువుల 'కబ్జా' కోరులకు శాటిలైట్ షాక్!



హైదరాబాద్, మార్చి 13 (భారతశక్తి): నగరంలో చెరువులను మింగేస్తున్న కబ్జా రాయుళ్ల ఆటకట్టించేందుకు హైడ్రా (HYDRAA) అత్యున్నత సాంకేతికతను రంగంలోకి దించింది. క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు, రికార్డుల తారుమారు వంటి సవాళ్లను అధిగమించేందుకు ఇస్రో అనుబంధ సంస్థ అయిన 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్' (NRSC) అందిస్తున్న ఉపగ్రహ సమాచారాన్ని హైడ్రా తన 'వజ్రాయుధం'గా వాడుకుంటోంది. శుక్రవారం ఎన్ఆర్ఎస్‌సీలో జరిగిన 'వికసిత్ భారత్ @ 2047' సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాల్గొని, అక్రమ నిర్మాణాల వెనుక ఉన్న అసలు గుట్టును విప్పారు.

**గతం సాక్షిగా.. ఆధారాలతో సహా!**

గతంలో చెరువు ఎక్కడ ఉంది? ఎంత విస్తీర్ణంలో ఉండేది? అన్న విషయంలో ఇప్పటివరకు కేవలం కాగితపు రికార్డులపైనే ఆధారపడేవారు. కానీ, ఇప్పుడు 2006 నాటి డిజిటల్ ఎలివేషన్ మోడల్ (DEM) డేటాను వాడుతూ ఎఫ్‌టీఎల్ (Full Tank Level) పరిధులను హైడ్రా శాస్త్రీయంగా నిర్ధారిస్తోంది.



- >> టైమ్ మెషిన్ డేటా: అవసరమైతే 1970, 1990ల నాటి ఉపగ్రహ చిత్రాలను కూడా పరిశీలించి, ఆక్రమణదారులు సాగించిన 'రీ డిజైనింగ్' మోసాలను బట్టబయలు చేస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు.
- >> ప్రజావాణిలో ప్రూఫ్స్: ప్రతి సోమవారం వచ్చే ఫిర్యాదుదారులకు.. పదేళ్ల క్రితం ఆ భూమి ఎలా ఉండేదో శాటిలైట్ మ్యాపుల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపిస్తుండటంతో కబ్జాదారులు నోరు మెదపలేకపోతున్నారు.

**అదృశ్యమైన నీటి ఆనవాళ్లు:**

ఓఆర్ఆర్ (ORR) పరిధిలో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఎన్ఆర్ఎస్‌సీ గణంకాలు చెబుతున్నాయి. ఒకప్పుడు కళకళలాడిన చెరువుల్లో దాదాపు 61 శాతం ఇప్పటికే మాయమైపోయాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో మిగిలిన వాటినైనా కాపాడాలనే లక్ష్యంతో హైడ్రా ఇప్పటివరకు 13,500 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి విముక్తి చేసింది. వీటి బహిరంగ మార్కెట్ విలువ అక్షరాలా ₹70,000 కోట్లు ఉంటుందని అంచనా.

**రియల్ బాధితులకు 'హైడ్రా-రక్ష' రక్షణ:**

ప్లాట్లు కొనే సామాన్యులు ఆ భూమి ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉందో లేదో తెలుసుకునేందుకు 'హైడ్రారక్ష' అనే పోర్టల్‌ను ప్రారంభించారు.
పోర్టల్ ప్రత్యేకత: జిల్లా, మండలం లేదా సర్వే నంబర్ నమోదు చేస్తే చాలు.. సదరు భూమికి సంబంధించిన జియోగ్రాఫిక్ కోఆర్డినేట్స్ స్క్రీన్ పై కనిపిస్తాయి. దీంతో వెంచర్లలో ప్లాట్లు కొనేవారు మోసపోకుండా ముందే జాగ్రత్త పడొచ్చు. ప్రస్తుతం ఇది అంతర్గత వినియోగంలో ఉన్నా, త్వరలోనే ప్రజలందరికీ అందుబాటులోకి రానుంది.

**శాస్త్రవేత్తల ప్రశంసలు:**

అంతరిక్ష సాంకేతికతను సామాన్యుడి రక్షణ కోసం వాడటంలో హైడ్రా కృషి అభినందనీయమని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కొనియాడారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా నీటి నాణ్యతను కూడా ఉపగ్రహాల ద్వారా పర్యవేక్షించేందుకు ఎన్ఆర్ఎస్‌సీ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్, ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఎవరి మీదా ఆధార పడకుండా.. స్వయం కృషితో ఎదగాలి

* **అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలి**
* **ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం ప్రారంభం.**



ఎల్బీనగర్, మార్చి 13 (భారత శక్తి): సురక్ష సేవా సంఘం తెలంగాణ ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం అనుబంధ సంస్థ అయిన సామాజిక విజ్ఞాన కేంద్రం సైఫాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆర్సీపురంలోని భారతీ నగర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వయం ఉపాధి శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. మహిళలు ఎవరి మీదా ఆధార పడకుండా, స్వయకృషితో ఎదగాలని అన్ని రంగాల్లో రాణించాలని సురక్ష సేవా సంఘం సామాజిక విజ్ఞాన కేంద్రంతో సమిష్టిగా మహిళలు వెదురుతో బుట్టలు, గృహోపకరణ వస్తువులు అలానే తోలు వస్తువుల తయారీలోనూ శిక్షణ ఇచ్చి తయారు చేసిన వస్తువులు మార్కెట్ లో ఏ విధంగా వాణిజ్యం చేయడం అనే అంశాలపై 6 రోజుల శిక్షణ శిబిరం సురక్ష సేవా సంఘం అధ్యక్షులు గోపి శంకర్ యాదవ్ ఆదేశాలు మేరకు శుక్రవారం భారతీ నగర్లో శిక్షణ కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సురక్ష సంగారెడ్డి జిల్లా ఇంచార్జి శ్రీమతి హారతి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు, స్కిల్ డెవలప్ మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు షరీన్ హిమబిందు, శ్రీమతి స్నేహలత, వైడీసీ వాలంటీర్ తులసి, ఇంకా కాలనీ పెద్దలు, 40 మంది శిక్షణ తీసుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.

# జాగృతి ఇక 'పొలిటికల్' ఎంట్రీ!

- **ప్రజల ఆకాంక్షే చారిత్రాత్మక అవసరం**
- **స్పష్టం చేసిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి**



హైదరాబాద్, మార్చి 13(భారతశక్తి): తెలంగాణ ఉద్యమ గొంతుకగా, సాంస్కృతిక సారథిగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన 'తెలంగాణ జాగృతి' త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరించబోతోంది. తెలంగాణ సమాజం, ప్రజల ఆకాంక్షల మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం ఒక చారిత్రాత్మక ఘట్టమని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని, శుక్రవారం నగరంలోని ఆమె నివాసంలో పాండురంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సంస్థ భవిష్యత్తు కార్యాచరణపై కీలక సంకేతాలిచ్చారు.

**అస్థిత్వానికి ప్రతీకగా..**

"తెలంగాణ అస్థిత్వాన్ని ప్రపంచ వేదికలపై చాటిన కవితమ్మ గారు, ఇప్పుడు అదే స్ఫూర్తితో పూర్తిస్థాయి రాజకీయ రంగంలోకి అడుగు పెట్టడం తెలంగాణ భవిష్యత్తుకు శుభసూచకం. ఏళ్ల తరబడి సాంస్కృతిక చైతన్యంతో ప్రజలను ఏకం చేసిన జాగృతి, ఇకపై రాజకీయ వేదికగా ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుంది" అని పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడాలన్న సంకల్పమే ఈ పార్టీ ఆవిర్భావానికి పునాది అని ఆయన స్పష్టం చేశారు.

# పది పరీక్షల వేళ 144 సెక్షన్ అమలు

* **మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆంక్షలు**
* **పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్ల మూసివేతకు ఆదేశం**



మల్కాజిగిరి, మార్చి 13(భారతశక్తి): పదవ తరగతి (SSC) వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ సిద్ధమైంది. పరీక్షల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పరీక్షల పవిత్రతను కాపాడేందుకు కమిషనరేట్ పరిధిలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (BNSS) సెక్షన్ 163 (గతంలో 144 సెక్షన్) కింద నిషేధాజ్ఞలు విధిస్తూ కమిషనర్ అవినాష్ మహంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**200 మీటర్ల పరిధిలో ఆంక్షలు:**

పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడడాన్ని కఠినంగా నిషేధించారు. ఈ ఆంక్షలు మార్చి 14వ తేదీ ఉదయం 6 గంటల నుండి ఏప్రిల్ 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అమలులో ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. అయితే విధుల్లో ఉన్న పోలీసులు, మిలిటరీ సిబ్బంది, హోమ్ గార్డులు, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు మరియు అంత్యక్రియల ఊరేగింపులకు ఈ నిబంధనల నుండి మినహాయింపు ఉంటుంది.

**జిరాక్స్ సెంటర్ల మూసివేత:**

పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల సమీపంలోని (100 మీటర్ల పరిధిలో) అన్ని ఫోటోకాపీ (జిరాక్స్) మరియు ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఈ కేంద్రాలు మూసి ఉంచాలని సూచించారు.

**కఠిన చర్యలు తప్పవు:**

నిబంధనలను అతిక్రమించి పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడినా లేదా అనుమతి లేకుండా జిరాక్స్ సెంటర్లు తెరిచినా సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశానికి సిద్ధం చేయాలి

: **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 13 (భారత శక్తి): మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలపై చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను, 99 రోజుల ప్రజా ప్రణాళిక ప్రగతి పాలన లో భాగంగా శుక్రవారం ఊరట్టం గ్రామపంచాయతీ కొత్తూరు హ్యాబిటేషన్ లో జరుగుతున్న పారిశుధ్య పనులను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతల గద్దెలపై చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రాంగణంలోని డ్రైనేజీ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని, ఆలయ రిలేయింగ్ ఫ్లోరింగ్ పనులలో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ 99 రోజుల ప్రజా ప్రణాళిక ప్రగతి పాలన లో భాగంగా ఊరట్టం గ్రామపంచాయతీ కొత్తూరు హ్యాబిటేషన్ లో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. గ్రామం లో మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.
స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం చేపడుతున్న





కార్యక్రమంలో స్వయంగా భాగస్వామ్యం కావాలని గ్రామపంచాయతీ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలని అన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు చేపట్టిన అందరూ గ్రామాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి విజయవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకొని ఉగాది పండగ వరకు గృహ ప్రవేశాలు చేయాలని లబ్ధిదారులకు సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పిల్లలకు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేసే పాల ప్యాకెట్ పై ఉండే ముద్రణ తేదీలను గమనిస్తూ గడువు దాటిన వాటిని గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లల ఎత్తు, బరువులను తరచు పరిశీలిస్తూ రక్తహీనతతో ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాలు శుభ్రంగా ఉండాలని, పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రీస్కూల్ బోధన లో భాగంగా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలని, పిల్లలు ఉత్సాహంగా ఉండేలా వాతావరణాన్ని కల్పించాలని, టీచర్లకు దిశానిర్దేశం చేశారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.